నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 11-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:125 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

ఎండ మావులు
పేదల కోరికలు
రాచ క్రీడలు

నాల్గుపాదాలు
నాలుగు రెండె రెండు
చీకటి న్యాయం

అభయ హస్తం
ఆరాధన దేవత
వరాల నేత

మతిమంతులు
కళ్లున్న గుడ్డివాళ్లు
ధనహీతులు

ఉత్తర ద్వారం
పాప విముక్తి ధామం
సుకృత ఫలం

– రేడియమ్
సెల్: 9291527757

శీనిజాలు

పెట్టుకున్న దరఖాస్తులు
అప్పుడే రోడ్డెక్కెనా?
ఇలా అయితే కాంగీ పరి
పాలనా ఒడ్డెక్కునా?

అమలు ఎప్పుడవుతాయో
ఆరు గ్యారెంటీలూ?
పథకాలూ నిలబడునా
ఇచ్చిన వారంటీలూ!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

మనసులో దాగిన బడబాగ్నికి అక్షర రూపం
–తను కరిగి సమాజానికి వెలుతురునిచ్చిన ఆశాకిరణం



తాజ్ మహల్ నిర్మాణానికి రాల్తెత్తిన కూలీలెవరు, కళింగ యుద్ధంలో అశోకుడు ఓడించిన రాజు పేరేమిటి అని శతాబ్దాలుగా ప్రశ్నించుకొంటున్నా జవాబు దొరకడం లేదు. అలాగే బడుగు జీవుల బాగు కొరకు, సమాజంలోని అరాచకాలను ప్రశ్నిస్తున్న, ప్రశ్నించిన కవుల గురించి పట్టించుకొనే తరం ఈ నాడు దొరకదు. కవుల గురించేం ఖర్మ, పక్కనుండే తన మనిషి గురించి కూడా. ఆర్థిక సరళీకరణ పేర జరుగుతున్న మానవత్వ విధ్వంసాన్ని ప్రశ్నంచే తీరిక కూడా ఈ తరానికి లేదు. అయినా, గతంలో ఈ సమాజాన్ని ప్రశ్నించి, సమాజ దోపిడీకి తనకు తెలియకుండానే తాను బలైన మరో మనీషి అలిశెట్టిగురించి సంవత్సరానికొక రోజైన ఆలోచించే ఓపిక, తీరిక ఈనాటి యువతకు లేకపోవడమే నేటి నాగరికత.

"బాటలెన్ని వేసినా, కోతలెన్ని కట్టినా, /స్వంత సంతకాలు పెట్టుకో(రా)ని వాళ్ళు,/సమాజం అంగడిలో శతబావున్న వాళ్ళకి/ అమ్ముడుపోయిన వాళ్ళు వీళ్ళు. / కనబడకుండా, కాల ప్రవాహంలో / తమ నెత్తురుని సత్తువని సహనాన్ని / దారబోసిన వాళ్ళు / .. చరిత్రకి మెత్తని తివాసి వాళ్ళు / దానికిందే చట్టుబండలై మరచిన వాళ్ళు/" అంటూ నాలుగు దశాబ్దాల క్రితమే ఊహించి చెప్పిన ఈ తరానికి మళ్ళీ నాలుగు మాటలు చెప్పాలని ప్రయత్నించిన అలిశెట్టి ప్రభాకర్ సర్వకాలీన, సర్వజనీన స్ఫురద్రూపి.

పెత్తందారి సామ్రాజ్యంలో పెట్టుబడిదారుల స్వార్థంలో న్యాయం సామాన్యులకు అందుబాటులో లేకపోవడం గత చరిత్ర కాదు, రేపటి వాస్తవమని సూటిగా సమాజాన్ని తట్టిలేపిన కాలజ్ఞాని. **"ఈ తరాని / ఈత రాని / నిరుపేదలకు / ఈ చట్టం / ఎత్తైన నీటి మట్టం / అనుకోని, వకీలు దగ్గరుకు వెళితే అతను " న్యాయాన్ని ఏ కీలు కా కీలు /విరగగొట్ట గలవాడే వకీలు /"** అంటూ కళ్ళు తెరిపించే ప్రయత్నం చేసిన స్నేహితుడు.

నేటిలా ఆనాడు టీవీలు లేకున్నా, ఉన్నపత్రికలు ఈనాటి టీవీలు తమ టీఆర్పిలు పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు, ఆపత్రికల వారు వార్తలకు ఇచ్చే ప్రాముఖ్యత చెపుతూ, **"మానభంగాలూ మర్డర్ కేసులే / వార్త పత్రికలకి పుష్టికరమైన ఆహారం/"** అంటూ వాస్తవాలను రెండు పంక్తులలో చెప్పిన ఘనుడు. రాజకీయ నాయకుల గురించి చేసిన వ్యాఖ్యలు ఎన్నో. **"వాడు ముందే వానపాము / మరి ముడ్డేదో మూతెదో / "** అంటూ, మరో కవితలో **"వీపు / బొజ్జా / వేరు వేరు పార్టీ / వీడేనండీ / రాజకీయ /కోజ్జా "** అని నిర్భయంగా, నిర్ద్వందంగా, రాజకీయ నాయకుల స్వభావాన్ని సిద్ధాంతీకరించాడు. సమాజంలోని అన్యాయాన్ని ఎదిరించడానికి ఎవరో రారాని, తన చేయి ఆ పని చేయగలదని చేతికున్న బలాన్ని చెప్పడంలో, చైతన్యాన్ని కలిగించడంలో తన అక్షర యుద్ధం కొనసాగించాడు. **"ఐదు భాగాలుగా / విభజించిన / అద్భుత లోహం / నా చెయ్యి/ అణు వణువూ / అన్యాయాన్ని / ధ్వంసించేందుకు /మిత్రుడా !/ నాతో కరచాలనం చెయ్యి/** అని ధైర్యం చెప్పేలా వాడు. అలాని, చిన్న కవితలె కాదు ధీర్ఘ కవితలు రాయడంలో కూడా దిట్ట.

"మృత్యు వృక్షం / శాఖోపశాఖలై/ కానలాల ఫలాలైన / భయానక చిత్రాన్ని / ఆవిష్కరించినా / ఋతువులన్నీ /రక్తసిక్తమై/ పాతరహితమే / కోల్పోయిన / ప్రాపంచిక పరిణామాల్ని/ పరిశోధించినా/ ..... విషయ రాజకీయ ఊబి/ సామాన్యుడి బతుకు చుట్టూ/ విస్తుతిస్తుంది /" అని బహుళజాతి ఆయుధ వ్యాపారాన్ని అంచనా వేసిన అద్వితీయ రచన "సంక్షోభ గీతం", దీర్ఘ కవిత. పేలని నాటు తుపాకిని సగటు మనిషితో పోల్చుతూ, **"కులాల పుళ్లపై / కుళ్ల బొడుస్తున్న / రాజకీయ కుతంత్రమా/ శ్మశానంలో / శాంతి దీపాలు వెలిగించే/ ప్రజాస్వామ్య ప్రభుత్వమా/.. నాటు తుపాకీ లాంటి సగటు మనిషి గురించీ-/ మందని మందుగుండువంటి వాని గుండె గురించి-/"** అని ప్రపంచ రాజకీయాలను అవపోసన పట్టిన మహా జ్ఞాని.

సాటి మనిషిని మాత్రమే చదివిన సగటు మనిషి, ఏ సాహిత్య ప్రభందాన్ని, సంస్కృతాంధ్ర కావ్యాలను చదవకున్నా, తోటి మనిషి కష్టాన్ని, కన్నీటిని అర్థం చేసుకొన్న గొప్ప మానవత్వవాది. దేశాన్ని బాగుచేయాలంటే ధైర్యం ఉండాలని నవనిర్మాణం కావాలంటే ఏదో చేయాలని ఆశించాడు. అందుకే **" రక్తకణాలు ఉత్పత్తి చేసే/ కర్మాగారాలు/ నిర్మిద్దాం / రక్తంలో నిక్షిప్తమైన/ సూర్యుళ్ళని / వెలికితీసి/ ప్రచండంగా వెలిగించే/ ప్రయోగశాలలు/ స్థాపిద్దాం/ లేదా/ ఇంత నేత్తురూ వెల్తురూ / కోల్పోయిన ఈ దేశం/ ఇంకెంతో కాలం బతకదు/"** అంతతో మరో చోట **" ఆశరుభరిత నాయనంలో నువ్వే/ క్షత్రగాత్రుడి నేత్రంలో నువ్వే/అయితేనేం / ఉద్యమాల హోరంలో/ ఉజ్వల భవితవ్యంలో నీ నువ్వే /"** అని ధైర్యాన్ని ఇచ్చే ధీశాలి.

ఈ అనంత విశ్వంలో ఎందరో సూర్యులు ఉన్నా, మానవాళికి ఒకడు సరిపోతాడు. కానీ ధనమదాందులతో నిండిపోయిన ఈ జనారణ్యంలో ఎంత మంది ప్రభాకరులున్నా, ఇంకా చీకటి విడలేదని, **"రహస్పంధ్య"** కవితలో **తొణికిసలాడే కన్నీళ్లలోంచే / మళ్ళీ ఒక ఇంద్రధనస్సు విచ్చుకొంటుంది/ అక్షరం అనంత భాష్పమవుతుంది"/** అన్న ఆశాజీవి. తెలంగాణ అస్తిత్వాన్ని నిలిపినా, తెలంగాణ రచయితలకు, కవులకు నిరంతరం మార్గదర్శిగా ఉండే కవిత్వాన్ని సృష్టించిన అలిశెట్టి ప్రభాకర్ పేర ఇప్పటి వరకు ఈతరం సాహితీవేత్తలు కానీ,తమ అవసరాలకు అనుగుణంగా ఆయన పేరు వాడుకొనే రాజకీయ నాయకులు కానీ తెలంగాణలో ఆయన స్థానాన్ని స్థిరపరిచి, శాశ్వతంగా అందరికీ కనబడే భౌతిక చిరునామాను మాత్రం కట్టించలేకపోయారు. అందుకేనేమో " మరణం నా చివరి చరణం కాదు/ మౌనం నా చితాభస్మం కాదు/ మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం/ నా అశ్రుకనం కాదు/.. అజ్ఞాతంగా అంతర్లీనంగా/ మట్టిపొరల్లోంచి పరివ్యాప్తమవుతున్న పోరాట పరిమళం/ నేను"/.. అని ఆయనను ఆయనే తెలుగు సాహిత్య చరిత్రలో తన స్థానాన్ని తానే నిర్ణయించుకొన్నాడు.

–సిహెచ్ వి ప్రభాకర్ రావు,
ఫోన్: 9391533339

చురక

పాత్రికేయాన్ని ప్రభుత్వం
పరిచారిక చేసే తంత్రం
పత్రికా న్యాయ సమ్మిత
బిల్లులో దుష్ట కుతంత్రం
ప్రశ్నించొద్దని తప్పులు
పాలకవర్గం సంకెళ్లు
బ్రిటిష్ నాడూ కూడా లేని
పత్రిక స్వేచ్ఛకు కన్నీళు

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

అందముగ ప్రధాని పదవి
కుందకముల నెరుగనట్టి గుల్జారీ లాల్
నందా ఈ దినముననే
అందలమని అందుకొనగ నభినందింతున్ ?

(11-1-1966 నందా తాత్కాలిక ప్రధాని అయిన రోజు)

–రాధశ్రీ
సెల్:9494481210

తెలుగు తరతరాలకూ వెలుగు
–అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న రచయిత ఆనందరావు

అనంతపురం, జనవరి 10: తెలుగు భాషా సంస్కృతిని పరిపుష్టం చేయడానికి విశేష కృషి చేసిన శ్రీ కృష్ణదేవరాయల గడ్డ అనంతపురం జిల్లా అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి అధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా సంస్కృతులకు పట్టాభిషేకం జరుగుతోందని పేర్కొన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అనంత తెలుగు భాషా వైభవ సదస్సును అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయబాబు, సి. రాఘవాచారి, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాలను 10 మందికి, తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారాలను 38 మందికి అందజేశారు. సదస్సులో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ప్రత్యేక వక్తల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్, జేఎన్‌టీయూ (ఏ) రిజిస్ట్రార్ సి. శశిధర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు.

ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి
–కైట్ ఫెస్టివల్ ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తాం
–తెలంగాణ కళలకు పూర్వ వైభవం తీసుకువస్తాం: మంత్రి జూపల్లి

హైదరాబాద్, జనవరి 10 జనవరి 13 నుంచి 15 వరకు హైదరాబాద్ లో జరిగే కైట్ అండ్ అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులు, సంబంధిత మంత్రి బేటీ అయ్యారు. కైట్ ప్లేయర్లు రకరకాల పతంగులు తీసుకుని ఇతర దేశాల నుంచి ఇక్కడకు వచ్చి మనకు పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు.

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే గాలి పటాల పండుగ ఏర్పాట్లను చర్చించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనమైన ఆతిథ్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిభింబించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భవిష్యత్ లో ఈ వేడుకను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏమైనా సలహాలు, సూచనలు ఇవ్వాలని, ప్రతిపాదనలు అందజేయాలని ప్రతినిధులను కోరారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ లో మంత్రి జూపల్లి మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఒక 'మినీ ఇండియా' అని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా కాస్మోపాలిటన్ సిటీలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఎన్నో మతాలకు హైదరాబాద్ నెలవుగా మారిందన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. సుమారు 15 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. 16 దేశాలకు చెందిన కైట్ ప్లేయర్స్ తో పాటు వివిధ రాష్ట్రాల కైట్ ప్లేయర్స్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ లో పాల్గొంటారని వెల్లడించారు. వివిధ రకాల, రంగుల పతంగులను ఎగురవేస్తారని అన్నారు.

వివరాలు తెలియజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.

వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తమ ఇంట్లోనే తయారు చేసిన 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ప్రదర్శిస్తారని అన్నారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులే ఇంటర్నేషన ల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ కు ఆహ్వానించారు.

కైట్ ఫెస్టివల్ ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తాం

రానున్న రోజుల్లో ఇంటర్నేషన్ నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తారిస్తామని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వ వైభవం తీసుకు వస్తామని మంత్రి జూపల్లి అన్నారు.

ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, క్లిక్ (అఒఎఅ) ప్రతినిధులు బెంజిమిన్, అభిజిత్, ఇంటర్నేషనల్ కైట్ ప్లయర్ పవన్ సోలంకి, తదితరులు పాల్గొన్నారు

ఆడబిడ్డల్ని బతకనిద్దాం

భారతీయ కుటుంబాల్లో బాలికల కంటె బాలురకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి రాజ్యమేలుతుంది. కుటుంబంలోనే బాలుర బాలికల మధ్య వివక్ష చోటుచేసుకుంది. బాలుర బాలికల మధ్య సామాజిక ఆర్థిక అసమానతలు ఉన్నాయి. కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితిగతులు కుమారుణ్ణి ఆస్తిగా కుమార్తెను బాధ్యతగా భావించే సాంప్రదాయం కొనసాగుతుంది. కుమార్తెను ఆర్థిక భారంగా బావించే సామాజిక పరిస్థితి బాలికల పాలిట శాపంగా మారిందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. పుట్టబోయే బిడ్డ "ఆడశిశువు" అని తెలియగానే గుట్టు చప్పుడు కాకుండా గర్భస్రావానికి పాల్పడుతున్నారు.

చట్టము ఉన్న ఫలితం సున్న

1870 లో బ్రిటిష్ ప్రభుత్వం " ఆడశిశువు హత్యా నిరోధక చట్టం" తెచ్చినప్పటికి అమలుకు నోచుకోలేదు. 2020 లో ఐ'రా'స జనాభా నిధి సంస్థ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం తల్లి కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణమే 4.58 కోట్ల మంది బాలికలు హత్యకు గురైనారని తెలిసింది. వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న" ప్యూ రీసెర్చ్ సెంటర్" అధ్యయనం ప్రకారం 2009-2019 ఒక దశాబ్ద కాలంలో 90 లక్షల మంది పిల్లలు మరణించారని తెలిపింది. ఆడపిల్ల అంటే ఆడపిల్లనే అనే సంస్కృతి సమాజంలొ నెలకొనడం బాలికల పాలిట శాపంగా పరిణమించింది. తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలియగానే "భ్రూణ హత్యలకు" పాల్పడటం సర్వసాధారణమైంది.

ఆడపిల్లలు నిర్లక్ష్యం

కుటుంబం నుండే ఆడపిల్ల పెంపకంలో నిర్లక్ష్యానికి వివక్షతకు గురికావడం విచారకరం. కుటుంబం నుండి మొదలైన వివక్షత నిర్లక్ష్యం చిన్న చూపు బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక, సాంఘీక, ఆర్థిక, సామాజిక వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది . సమస్యల విషవలయంలో చిక్కుకు పోయిన ఆడపిల్లలఅభివృద్ధి "సంక్షేమంఆశించినమేరకుజరుగలేదు. ఆడపిల్లలను కించపరచడం సామాజిక రుగ్మతైంది. పేదరికం, నిరుద్యోగం, 'నిరక్షరాస్యత ఆడబిడ్డను పోషించే స్థోమత లేక బడుగు బలహీన వర్గాలు గిరిజన, కొండజాతి ప్రజలు అడ శిశువులను విక్రయిస్తున్నారు. కష్టపడి పెంచి చదువులు చదివించినప్పటికి పెళ్ళి టైంలో వరుడికి కట్నం కానుకలు ఇవ్వాల్సి వస్తుంది.ఆ వరకట్న దురాచార రద్దు కోసం చేసిన చట్టాలు అమలు కావడం లేదు. పుట్ట పోయే బిడ్డ ఆడబిడ్డ అని తెలిస్తే గర్భ స్రావం చేసే వైద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. పెళ్ళి టైంలో బారీ కట్నం కానుకలు ఇవ్వలేమని, భార్యా భర్తల మధ్య గొడవలు అల్ప ఆదాయాలు ఆడ పిల్లను కనటానికి కుటుంబ సభ్యుల సపోర్ట్ లేకపోవడం. ప్రభుత్వం నుండి తగిన ప్రోత్సాహం లభించక పోవడం మున్నగు కారణాలు ఆడ శిశువుల హత్యలను ఆపలేకపోతున్నాయి.

బాలికలపై మహిళల పై పాఠశాలల్లో పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేదింపులు

అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి. మహిళల అక్రమ రవాణా మహిళపై దాడులుపెరుగుతున్నాయి. బాలికలకు భద్రత లేదు. ఇలాంటి స్థితి గమనించిన తల్లితండ్రులు ఆడపిల్లలను గర్భంలోనే తొలగించు కోవడానికిమొగ్గు చూపుతున్నారు.

మొబైల్ స్కానింగ్ సెంటర్స్ ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడశిశువు అని తేలగానే భారీ సంఖ్యలో అబార్షన్లు చేయించు కుంటున్నారు. కొడుకు కావాలని కోరుకునే తల్లి తండ్రులను లక్ష్యంగా చేసుకొని స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు భారీగా డబ్బులు గుంజుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశములో ప్రతి 110 మంది బాలురకు కేవలం 100 మంది బాలికలే ఉన్నారని సర్వేల్లో తేలింది.

చట్టాలు విఫలం బాలికలకు విద్య వైద్యం ఆహారం చట్టబద్ధమైన హక్కు ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత,బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించాలని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు' పథకాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు . సమస్యలే ఆడపిల్లల ఆస్తులుగా అవమానాలు నిర్లక్ష్యం అనారోగ్యం వేతన వివక్ష వారికి ఆభరణాలుగా పరిణమించాయి.

రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన " "భేటీ బచావో బేటి పడావో' అనే పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశ పెట్టిన పథకం రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా 'శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది.బాలికల సంరక్షణ కొరకు ఆడపిల్లలకు షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం, కిశోరి శక్తి యోజన, సుకన్య, స్వమృద్ధి యోజన, పౌష్టి ఆహార పథకం మొదలగు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.

స్త్రీల నిరక్షరాస్యత

జనాభాలో నేటికీ 20 కోట్ల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

తగ్గుతున్న స్త్రీ పురుష నిష్పత్తి రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. ఇలాగే కొనసాగితే చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు.

బాల్యవివాహాలు దేశంలో 26.5శాతం బలవంతపు బాల్య వివాహాలు జరుగుతున్నాయి.ప్రపంచంలో జరుగుతున్న 40 శాతం బాల్యవివాహాలు మన దేశంలో జరుగుతున్నాయని "యూనిసెఫ్" వెల్లడించింది. మన దేశంలో 40 శాతం బలవంతపు బాల్య వివాహాలు పశ్చిమబెంగాల్లో చోటుచేసుకోవడంగమనార్హం

భ్రూణహత్యలు

ఆడపిల్లను మైనస్‌గా భావించి మగ శిశువును ప్లస్‌గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణహత్యలకు బలై వివక్షతకుగురౌతున్నారు .

1970 వ దశాబ్దంలో మగ పిల్లవాడు పుట్టే వరకు ఆడ పిల్లలను కనే వారు.జనాభా పెరుగుదల సమస్యగా మారడంతో గర్భస్రావం ఒక పరిస్కారంగా ముందుకు తీసుకు వచ్చింది.1990 దశాబ్దంలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ విధానాలు అందుబాటులోకి రావడం వల్ల భ్రూణ హత్యలు ఎక్కువైనాయి. కేంద్ర ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం-1994 లో ప్రవేశ పెట్టింది. 2004 లో సవరించారు.ఐనప్పటికి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి వారిని ప్రోత్సహించిన వారికి 50 వేల రూపాయల జరిమానా' జైలు శిక్ష విధించాలని నిబంధనలు పాటించకపోవడం శోచనీయం.

బాలికలు పేదరికం

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో అసంఘటిత 'ప్రైవేట్ రంగంలో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి 'లైంగిక వివక్షతకు భిక్షాటనకు గురవుతూ తమ అమూల్యమైన బాల్య దశను పేదరికం 'ఆకలిచావులు అల్ప పౌష్టికాహారం అనారోగ్యానికి గురౌతున్నారని అనేక

అధ్యయనాలల్లోతేలింది. .

ప్రభుత్వం బాలికల సంరక్షణ చర్యలు బాలికల సమగ్ర వికాసానికి, సంరక్షణకు అవసరమయ్యే విధానాలను అమలు చేయాలి.

బాలికల భద్రత,లింగ నిష్పత్తి విద్య, వైద్యం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు బాలురతో పాటు సమాన అవకాశాలు సమాన హక్కులు' స్వేచ్ఛ కల్పించాలి .

బాలికల అభివృద్ధియే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యావకాశాల సాధనకు "ప్రతేక నిధిని" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైనచర్య. బాలికల హక్కుల రక్షణ భద్రత పౌరసమాజం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఆడపిల్లలను మగపిల్లలతో పోటీ పడేట్లు ప్రోత్సహించాలి .అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి . ఆడపిల్లల అభివృద్ధి దేశాభివృద్ధిగా భావించాలి. దేశ ప్రగతి పురోగతిలో ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలి. బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి. సమాజంలో మహిళాల పట్ల గౌరవంఆర్థికస్థాయి.సామాజిక హోదా పెంచాలి.

బాలికల సంరక్షణ ప్రభుత్వం బాల్య వివాహాలు బాలికల అక్రమ రవాణా, అత్యాచారాలు లైంగిక వివక్ష మొదలగు సమస్యల నుండి ఆడ పిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి . పౌరసమాజం యువజన సంస్థలు 'మహిళా సంఘాలు 'స్వచ్ఛంద సంస్థలు ఆడపిల్లల సంరక్షణ హక్కులరక్షణకుపాటుపడాలి

బాలికలు డిజిటల్ విద్య ప్రభుత్వం బాలికలకు డిజిటల్ విద్య టెక్నాలజీ ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య 'ఉపాధి దోహక విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి . బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి . బాలికల సామాజిక' ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి .

మహిళా రిజర్వేషన్స్ కేంద్ర రాష్ట్ర 'ప్రభుత్వ 'ప్రైవేట్ రంగ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశ పెట్టి రాజకీయాలలో స్త్రీల వాటా పెంచాలి.

మహిళా సాధికారిత

ప్రభుత్వం మహిళా సాధికారిత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక 'పారిశ్రామిక 'వ్యవసాయ వ్యాపార 'వాణిజ్య 'రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి .బాలికల కొరకు ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి. భ్రూణ హత్యలను నిరోధించే చట్టాలు అందుకు దారి తీసే పరిస్థితులపై పోరాడే చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి.వరకట్న నిషేధ చట్టం1961 లైంగిక నేరాల నుండి ఆడ పిల్లలకు రక్షణ కల్పించే.చట్టం2012

ను సమర్థవంతంగా అమలు చేయాలి. మగ పిల్లల కోసం ఎదురుచూస్తున్న దంపతులను ఆశా కార్యకర్తలు అంగన్ వాడి కార్యకర్తలు గుర్తించి గర్భ స్రావం వల్ల కలిగే అనారోగ్యం నష్టాల పట్ల "కౌన్సెలింగ్ "ఇవ్వాలి. ప్రతి గ్రామంలో "గ్రామ సభ" తల్లుల సంఘాలు ' మహిళా సంక్షేమ చట్టాలు 'భ్రూణ హత్యలకు పాల్పడితే వేసే జరిమానాలు శిక్షల పట్ల చర్చలుజరపాలి .అవగాహన చైతన్యం కలిగించాలి.

ఆడపిల్లలను పుట్టనిద్దాం బతుకనిద్దాం చదువనిద్దాం ఎధుగనిద్దాం అన్న నినాదం విధానమ

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 11-1-2024

నాగన్న పదాలు

తరుల వల్లే జలము
జలము వలనే జనము
జనముంటేనే జగము
ఓరి! నాగన్న.

అందమైనది బొమ్మ
గృహ అధిపతి గుమ్మ
తనువు నిచ్చెను అమ్మ
ఓరి! నాగన్న.

సాగు చుట్టాల హోరు
కర్షకులతో పోరు
సర్కారుకు బేజారు
ఓరి! నాగన్న.

పుతిన్ నిజ ఆక్రోశం
ఉక్రెయిన్ విధ్వంసం
నియంతల క్రౌర్యం
ఓరి! నాగన్న.



-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

సంబరాలు

ఆత్మన్యూనతను
అధిగమించు
ఆత్మీయతను
ఆస్వాదించు.

తారుమారయ్యిందని
తల్లడిల్లకు
తరం మారిందని
మరువకు.

కన్నీళ్ళను
ఖర్చుపెట్టకు
ధైర్యాన్ని
దాచిపెట్టకు.

కావు కావుమంటున్న
కాకిని కసురుకోకు
ఏవీ నీవీ కావనే
అర్థముందని మరువకు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

అలిశెట్టి కవిత్వంలో స్త్రీవాద కోణం



-బి.నర్సన్
9440128169

ప్రధానంగా రాజకీయాల్లోని నీతిలేమిని, సమాజంలోని నిర్దయని, శ్రమ దోపిడీని తన కవితల ద్వారా విశదపరచిన అలిశెట్టి ప్రభాకర్ అక్షరాల్లో మహిళల స్థితిగతులపై కూడా ఒక ప్రత్యేక దృష్టి కనబడుతుంది. సమాజం పోకడలపై విరుచుకుపడే ఆయన స్త్రీల బతుకు వెతలపై రాస్తున్నప్పుడు వేదనా భరితుడౌతాడు. అక్షరాల్లో ఆర్ద్రత నిండిపోతుంది. భాష మృదువుగా మారిపోతుంది. అలిశెట్టికి బ్రాండ్ గా నిలిచిన 'వేశ్య' కవిత స్త్రీ అసహాయతకు ప్రతిరూపమే. 'తను శవమై / ఒకరికి వశమై / తనువు పుండై / ఒకరికి పండై / ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసిస్సై' అనే చిన్ని కవిత లోని అక్షరమక్షరంలో మూగ రోదన వినిపిస్తుంది.

స్త్రీల పట్ల ఆరాధనాభావంతో పాటు వారి శారీరక దోపిడీ, నిలువెత్తు నిస్సహాయతలపై బాధాతప్త వేదన ప్రభాకర్ కవితల్లో జమిలిగా కనబడతాయి. ఆరుగురు అక్కాచెల్లెళ్లు ఉన్న ఆయనకు ప్రతి స్త్రీలో ఆత్మబంధువే కనబడింది. 'ఎన్నెన్నో అలల్ని / ఈ జీవితంలో కలుపుకున్నా / ఒక్కసారన్నా ఉప్పొంగని సముద్రం' అంటూ వారి ఓపికను చిత్రీకరించాడు. ఈ మగ దురహంకార సమాజంలో అన్ని రకాలుగా కష్టనష్టాలకు గురవుతున్న మహిళను 'అగ్ని సముద్రమ్మీద అందాల పడవగా చూశాడు. వారి జీవితం **'గాయాల పేజీలు/ పురివిప్పిన పింఛంలా / కన్నీళ్ల నిచ్చెనతో / కర్కశ పాదాల్ని మోస్తున్న /కఠోర తపస్సులా'** ఉందంటాడు. ఇంటా బయటా నిత్యం ఏదో రకమైన వివక్షను, అవమానాలను ఎదుర్కొనే మహిళను ఆయన **'ఆమె కాలాన్ని ఆశ్రయించిన అప్రపు / నెత్తుటి గాయాల సంపుటి / రగిలే బాధల కుంపటి'** అన్నాడు. ఈ సమాజంలో స్త్రీ ఎంత అసౌకర్యంగా బతుకుతుందో ఈ పదాలు చెబుతాయి. వస్తు విక్రయానికి వ్యాపారులు ఆడవారి అందాల్ని ఎర వేయడాన్ని నిరసిస్తూ **'ప్రకటనల గాలి వీచినప్పుడల్లా /రాలిపడే / ఒక నాజూకు పూలరెమ్మ నీవే'** అని ఓదార్చుతాడు.

ఆడది అయితే చాలు, తోడబుట్టిందా, కడుపున పుట్టిందా అనే కనీస మానవ స్పృహ లేకుండా, లోకమంతా సిగ్గుతో తలవంచుకొనేలా ఆ జాతిపై జరుగుతున్నా లైంగిక హింసకు తల్లడిల్లుతూ **'పయసు తో పాటు ప్రకృతిసిద్ధంగా అంగాలు ఎదగడం కూడా / ఒక రకంగా హత్యే / ఎందు కంటే / ఇది మానభంగాల దేశం'** అని చెబుతూ చివరకు 'కోర్టులేం చేయవు.. కన్నీళ్లేం చేయవు' అని తల దించుకుంటాడు.

'విషాద సాక్షాత్కారం' అనే కవిత మహిళలపై వివిధ దశలలో, విభిన్న సామాజిక స్థాయిల్లో జరుగుతున్న హింసను, దాడిని, విష సంస్కృతిని దునుమాడిన రచన. లైంగిక దాడులను, అశ్లీల సాహిత్యాన్ని, అందాల పోటీలను, కట్నం ఉరితాళ్లను వ్యతిరేకిస్తూ **'కన్నీళ్ళని ఏ భాషలోకి అనువదించిన/ విషాదం మూర్తీభవించిన స్త్రీయే / సాక్షాత్కరిస్తుంది' అంటాడు.**



నేర్పే మెరుపులున్నాయి. స్త్రీ పట్ల ఆయన ప్రత్యేక పదజాలాన్ని వాడిన దాఖలాలు కూడా చూడవచ్చు. ఎన లేని అనురాగంతో వారిని మొగలి రేకులతో, పూరెమ్మలతో, చంద్రవంక లతో పోల్చాడు.

ప్రభాకర్ రాసిన దీర్ఘ కవితల్లో మహిళల ప్రస్తావన విశేషంగా కనబడుతుంది. **'రహస్యంధ్య'లో 'మహిళ సంఘాలు నడుం బిగించక ముందే / దేశద్రోహి** అమ్మపాలు అమ్మకానికి పెడతాడు' అన్నాడు. **'మానభంగాలు, లైంగికదాడి, వరకట్నపు చావులు, అత్యాచారాల మధ్య / మిగిలిన స్త్రీజాతి అవశేషాలే / మళ్ళీ మగ జన్మని ప్రసాదించడానికి ఉవ్విళ్లూరుతాయి'** అందంలో ఒకింత వ్యంగ్యముంది. మగజాతితో పడరాని పాట్లు పడుతున్న స్త్రీ 'మగబిడ్డ'కై ఆరాటపడడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అలిశెట్టికి కూడా ఇద్దరు కొడుకులే పుట్టడం కాకుండా ఇద్దరు మనవలకు తాత కావడం ఓ జీవన వైచిత్రి.

మహిళకు అక్షర హారతి పట్టిన ప్రభాకర్ కు ప్రతిఫలంగా భార్య భాగ్యం ఆయన పర్యంతం ఎనలేని సేవలు చేసింది. వాటిని కూడా అక్షర బద్ధం చేయకుండా అలిశెట్టి ఉండలేక పోయాడు. ఆయన చివరి రోజుల్లోని కవితల్లో భార్యను నిజంగానే తన 'భాగ్యం'గా భావిస్తూ ఆమెను తన అక్షరాలతో తడిమి చూసుకున్నాడు. 'భాగ్యలక్ష్మి', 'హృదయత్రాసు' అనే కవితలు అందుకు ఉదాహరణలు. **'సిగరెట్ పీకలాంటి నన్ను / సిగలో తురుముకొని / గాజుకుప్పెల్లాంటి నా కళ్ళలోనే / ఆశల అగరొత్తులు వెలిగించుకుందే తప్ప / తులతూగే ఐశ్వర్యమో / తులం బంగారమే కావా లని / ఏనాడూ ప్రాధేయపడలేదు'** అని ఓ చోట 'తెగిన తీగలు / నవరించడానికన్నట్లుగా /తెల్లవార్లూ పరిచర్యలు చేసే / నా భాగ్యమే /నా కన్నీళ్లను తూచే /సున్నితపు త్రాసు' అని రుణ భారాన్ని తూకం వేశాడు.

ఈ ప్రపంచాన్ని అన్ని కోణాల్లోంచి అంచనా వేసిన, తెలుగు జాతి గర్వింప దగ్గ కారణజన్మ కవి అలిశెట్టి. జనవరి 12, 1993 నాడు 39 ఏళ్ల వయసులోనే మరణించిన ఆయన సుమారు 15 ఏళ్ల పాటు క్షయ వ్యాధితో బాధపడ్డాడు. చివరి నిమిషం వరకు కవిత్వాన్ని శ్వాసిస్తూనే బతికాడు. 'ఎడతెరిపి లేని దగ్గు, అడుగు కడపనివ్వని ఆయాసం, రక్తం ముద్దలు పడుతున్న రోజుల్లో కూడా నేను కవిత్వాన్ని నిర్లక్ష్యం చేయలేదు. నాలోని విలువల్ని భగ్నం చేసుకో లేదు.' అని సిటీ లైఫ్ ముందుమాటలో రాసుకున్నాడు. 2013 లో ఆయన సమగ్ర కవిత్వంతో వచ్చిన 'అలిశెట్టి ప్రభాకర్ కవిత' ఇప్పటికే పది వేల కాపీలుగా జనాదరణ పొందింది. ప్రభాకర్ కుటుంబం అనుమతితో ప్రస్తుతం 'తెలంగాణ పబ్లికేషన్స్' వాటిని పంపిణీని చేస్తోంది. కాపీల కోసం 8639972160 సంప్రదించవచ్చు.

ఇక 2023 – అలిశెట్టి ప్రభాకర్ వార్తల్లోకెళితే 9 జులై నాడు హైదరాబాద్ కు చెందిన ' లివ బప్పజీశ్రీశ్రీ నీలవతీఇ నీఎవ బితిబీబబి మరియు ముల్కనూరు సాహితి పీఠం కలిసి అలిశెట్టికి 'నవ కవితాభిమన్యు' అనే బిరుదు ప్రదానం చేసి ఆయన కుటుంబానికి లక్ష రూపాయలు అందించారు. సెప్టెంబర్ లో ఆనాటి తెలంగాణ ప్రభుత్వం అలిశెట్టి కుటుంబానికి గౌరవప్రదానంగా నగరంలోని జియాగూడలో 'రెండు పడకల ఇల్లు'ను అందజేసింది. రొమ్ము క్యాన్సర్ పీడితురాలైన భాగ్య ఆరోగ్యం అలిశెట్టి మిత్రుల అభిమానుల సహకారంతో తగిన వైద్యం అందక తిరిగి కుదుటపడుతోంది. సెలవు.

(జనవరి 12 అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

అలిశెట్టి ప్రభాకర్ కవి

అలిశెట్టి ప్రభాకర్

జగిత్యాలలో జననం
భాగ్యనగరంలో మరణం
జయంతి ఈరోజే
వర్ధంతి ఈరోజే
అదే జనవరి పన్నెండు–
మినీ కవితలు రాసినాడు
మిన్నంటే భావాలను పేల్చినాడు
తనువు పుండై..ఒకడికి పండై
అలిశెట్టి రాసిన వేశ్య కవిత
గుండెను పిండేసే కవిత–
అలిశెట్టి రాసిన కవితలు
అవి సమాజానికి చురకలు
అలిశెట్టి ఎగరేసిన కవితలు
అవి మంటల జెండాలు
కవి అలిశెట్టి నడచిన కవితామార్గం
నడవాలంటే కావాలి పెన్నునిండా ధైర్యం–
కవి అలిశెట్టి కవితలు
అవి విస్ఫోటనాలు
'మరణం నా చివరి చరణం' కాదన్నాడు
తన కవిత్వంతో ఇప్పటికీ బ్రతుకుతున్నాడు..
కటిక పేదరికం అనుభవించాడు
అయినా కవిత్వాన్ని అమ్ముకోలేదు
సన్మానాలను అంగీకరించలేదు
అలిశెట్టి నిబద్ధతతో బ్రతికాడు..
శ్రీ శ్రీ మహాప్రస్థానం బాటలో
నడిచిన ఒకేఒక్క కవి అలిశెట్టి
శ్రీ శ్రీ పెన్నును గన్ను గా మార్చినాడు
లెటర్స్ ను బుల్లెట్స్ గా చేసినాడు
అలిశెట్టి పెన్నును ఫిరంగిగా మార్చినాడు
కవితలను అణుబాంబులుగా పేల్చినాడు

–బూర దేవానంద, 8143589789.

తేడా

అతను
చాలా చలాకీగా
చురుకుగా తిరిగేవాడు!
ఓ సిద్ధాంతి గారి సలహాతో
తాబేలు ఉంగరం
ధరించాడు!
ప్రతిపనిలో
నెమ్మదై పోయాడు!

–జయంతి
లక్ష్మీ నరసింహం

హృదయం

కథ

–డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148



"మొద్దు!"

"వాడొట్టి, 'రాయి'!"

"అయ్యా అవ్వా, అక్కా ఎవ లొద్దు వానికి. ఏ పేమల్లేవ్. దున్నపోతు!"

ఇలా ఎన్నో తిట్టు తిన్న బుచ్చిగాడు కరగడని ఊరందరి చేతా అనిపించుకున్న బుచ్చిగాడు కరిగిపోయిన మంచిలాగా తెగిపోయిన పైప్‌లాగా ఒకటే ఏడుస్తున్నాడు.

వాడేడస్తుంటే చాలామందికి ఆశ్చర్యంగా వుంది.

మంచం మీద పడుకుని, పడుకుని మంచమే తనై, తనే మంచమై జీవించిన నాయనమ్మ ప్రమోషన్లొచ్చినట్లు ప్రపంచం మీంచి నేరుగా 'పాడె' మీదికి, పాడె మీంచి తిన్నగా కాడు మీదికి వెళ్లిపోయి నప్పుడు ఆ ఇల్లంతా ఏడ్చింది– కానీ బుచ్చిగాడు ఏడ్వలేదు.

గాంధీగారిలాగా బతకాలనీ, గాంధీగారిలాగే చావాలనీ కలలు కన్న వాళ్ల రాజకీయపు దిక్కు పెదనాన్నగారి శవయాత్రకు ఊరు ఊరంతా ఏడ్చింది. కానీ, బుచ్చిగాడు మాత్రం ఏడ్వలేదు.

ఆత్మలే తన ఆహారమనీ, చుట్టాలే తను గడించిన నోట్లకట్టలనీ భావించి తన సర్వస్వాన్ని బంధుపోషణ కోసం ధారపోసిన అమ్మ తరపు మీసాల తాతయ్య చనిపోయినప్పుడు బంధుకోటి అంతా ఏడ్చింది– కానీ, బుచ్చిగాడేమాత్రం ఏడ్వలేదు.

అందుకే వాణ్ణి, 'రాయి' అన్నారంతా. ఆ రోజు 'సూతు' ముందని అందరూ అరుగు మీదే పడుకున్నారు. ఏ రాత్రికో పక్కకి తిరిగి నిద్రలోంచే చెయియ వేసి చూశాడు. ఏదో వెలితి కనిపించినట్లయింది. కావల్చిందేదో లేనట్లు ఫీలయి పక్కంతా తడిమి చూశాడు కళ్లు తెరవకుండానే. ఆకస్మాత్తుగా భయపడ్డట్లు లేచి కూచున్నాడు.

'నీలూ, తన నీలూ'.

నీలు ఎక్కడా కనిపించట్లేదు. చీకటిగా ఉన్నా తెల్లారబోతున్నట్లు సన్నగా కనిపిస్తోంది. ఆ చుట్టుపట్ల వెదికాడు. ఎక్కడా నీలు జాడలేదు. నిరాశపడ్డాడు. పూర్తిగా తెల్లారినాక వెదుకుదామని మెల్లగా ఒరిగాడు.

భయం! ఆలోచన్లు!

ఆలోచన్లు దయ్యాల్లా పీక్కు తింటున్నాయి. భయం రంపంలా కోస్తుంది. 'నీలూ' అని అరుద్దామనుకున్నాడు. నోరు రాలేదు. నిద్ర రాలేదు. పెరట్లో దొడ్లో వెదుకుదామని లేచాడు. చిన్నగా అడుగులేస్తూ తీక్షణంగా చూడసాగాడు.

తెల్లారుతోంది. వెలుతు రొచ్చేస్తుంది.

సూర్యుడు, 'నేనున్నాన్నులే, నీ నీలూని వెదికి పెడతా'నన్నట్లు, పైకొచ్చేస్తున్నాడు బుచ్చిగాడికి సూర్యుడంటే భలే ప్రేమ. అప్పుడప్పుడూ బుచ్చిగాడనుకునేవాడు. 'నీలూ లేకున్నా, సూరీడు లేకున్నా, బావికాడి చింతచెట్టు లేకున్నా తమ బతికేవాడు కాదేమో'నని.

ఆ మూడే తను చాలా ఇష్టపడేవి. ఆ మూడే తన పంచప్రాణాలు. నీలూ కనిపించకపోయేసరికి బుచ్చిగాడికి పిచ్చెక్కుతున్నట్ల నిపించింది.

లైలా ప్రాణం మజ్నూ దగ్గర ఉన్నట్టే. దొర ప్రాణం చిలకమ్మ మీదున్నట్టే, ఆ వూరు షావుకారు ప్రాణం త్రిజోరీలో ఉన్నట్టే, బుచ్చిగాడి ప్రాణం, 'నీలూ' దగ్గర వుంది.

నీలూ అంటే ప్రణయాధి దేవత కాదు, ఉడికించే ఆడది అంతకన్నా కాదు. త్రిజోరీ పేరు అసలే కాదు. వీటన్నిటి కన్నా ఎక్కువే బుచ్చిగాడికి.

నీలూ అంటే తన ఫ్రెండ్! తన సర్వస్వం!

కానీ, ఆ వూరందరికీ మాత్రం నీలూ అంటే పిల్లి! మామూలు పిల్లి! చిన్న జంతువు.

ఆ పిల్లి కోసం పొద్దున్నుంచీ మధ్యాహ్నం దాకా తిరిగాడు. గడి వాములు, చొప్పవాములు, పిడకల కుచ్చెలు ఏవేవో చాలా గాలించాడు. నీలూ ఎక్కడా కనపళ్లేదు.

బుచ్చికి భయమేసింది. బాదేసింది. చచ్చిపోదా మని కూడా అన్పించింది.

చివరికి ఏదీ తోచక బావి దగ్గరికెళ్లాడు. చింతచెట్టు కడుపులో కూచుండి ఏడుస్తున్నాడు. చిన్న రాయి తీసుకుని చెట్టు మీద పిచ్చిగా చెక్కాడు. అప్రయత్నంగా పిల్లి (బొమ్మ) కనిపించినట్లయింది. చిన్నగా ఏడ్వటం మొదలెట్టాడు.

చాలాసేపు గడిచింది. తన కోసం ఎవరూ రా లేదు. సూర్యుడు ధైర్యం చెప్పటానికి వెన్ను తడుతు న్నట్టు అనిపించింది. చింతచెట్టు తన కన్నీళ్లు తుడవటానికి కొమ్మల చేతులు వొంచుతు న్నట్ట నిపించింది.

బుచ్చిగాడి కళ్లు అలసిపొయ్యాయి. చిన్నగా నిద్రపట్టింది.

బుచ్చిగాడికి నిండా కొడితే ఏడెని మిదేళ్లు కూడా ఉండవ్. ఎరగ్రా మేడిపండులా ఉండకపోయినా నల్లగా బొగ్గులా మాత్రం ఉండడు. అయినా అందరు 'కర్రోడా' అనే ఎగతాళి చేస్తారు. పళ్లు అసమ్యంగా లేకున్నా, ముఖం భయంకరంగా లేకున్నా కాళు

గాంధీగారిలాగా బతకాలనీ, గాంధీగారిలాగే చావాలనీ కలలు కన్న వాళ్ల రాజకీయపు దిక్కు పెదనాన్నగారి శవయాత్రకు ఊరు ఊరంతా ఏడ్చింది. కానీ, బుచ్చిగాడు మాత్రం ఏడ్వలేదు.

వెనక్కి లేకున్నా ఇంట్లో వాళ్లు 'దయ్యమా' అనే పిలుస్తారు. అందుకే వాళ్లంటే కసి వాడికి. అసలు– మనుషులంటే, వాళ్ల అలికిడంటే, అరువు తెచ్చుకున్న వాళ్ల మాటలంటే, అతికించుకున్న వాళ్ల ప్రేమలంటే బుచ్చికి విపరీతమయిన కసి.

పట్టుమని స్నానం చేయించే దిక్కెవరూ లేనందుకు వాడు దుమ్ములో మునిగి, దుమ్ములో తేలి దుమ్ములాగే ఉన్నట్టుంటాడు. చింపినా చినగని నిక్కరు– దానికి పొడుగాటి రెండు నాడాలు అవి ఆ భుజం మీంచొకటి, ఈ భుజం మీంచొకటి అడ్డంగా పాకి వీపు మీద, పొట్ట మీద రెండు క్రాస్ గుర్తులుగా మారి ముందు నిక్కరు పట్టీలకు ముడేయబడి ఉంటాయి. అంగీ తొడుక్కోవటం వాడికెప్పుడూ ఎరుకే లేదు. అందరిలాగే వెంట్రుకలు వొత్తుగానే వున్నా వాటి మధ్య పిలక ముడి సన్నగా వేలాడుతూ ఉంటుంది. క్రాఫ్‌లో పిలక చాలా వికారంగా ఉంటుందనీ, దాన్ని కత్తిరించమనీ బుచ్చి ఎంత మొత్తుకున్నా వాళ్లింటివాళ్లు వినలేదు. యముడాల రాజేశుని మొక్కు తీర్చాక కాని, దాన్ని కదపటానికి ససేమిరా వీల్లేదంటారు. ఆ పిలకే వాడి చుట్టూ ఉండే పిల్ల జనాలకు వికారంగా ఉంది. పిలక ముడి పీకుతూ వేళాకోళమాడేవారు. అందుకే బుచ్చి వాళ్లెవరితోనూ కలిసుండే వాడు కాదు. ఏ ఒక్కరితోనూ స్నేహం చెయ్యడానికిష్టపడలేదు. ఊరవతల బావి దగ్గరి చింతచెట్టు కింద ఒంటరిగా గడిపేవాడు పొద్దంతా.

బుచ్చివాళ్లది మిడిల్‌క్లాస్‌లో లోయర్‌స్టెప్ రైతు కుటుంబం. వాళ్ల వంశంలో పెద్దనాన్నకి తప్ప ఎవరికీ చదువు అంటలేదు. బుచ్చి తల్లిదండ్రులకు జీవితమంటే కష్టపడటం, పండించటం, సంపాయించటం తప్ప అంతకుమించినవీ, ఎంతో విలువైనది ఉంటాయని తెలియదు. బుచ్చి వాళ్ల అక్కకి అంతకన్నా తెలీదు. ఫలితంగా బుచ్చి కోరుకునేది వాల్ల ముగ్గురిలోనూ దొరకలేదు.

నాలుగేళ్లప్పుడే బుచ్చిని కూడా స్కూలుకి పంపారు. మొదట్లో స్కూలుకి వెళ్లటం, పిల్లలతో కలిసి గెంతటం, ఆడటం బాగానే అనిపించింది. మాష్టారు మీద కూడా మహా ఇష్టంగా ఉండేది. అక్షరాలు దిద్దటం, అందరికన్నా ముందుగా రాసి అప్పజెప్పాలని పోటీపడటం– ఏడాది ముందే స్కూల్లో చేరిన సుందరంగాన్ని దాటేసి కొత్త అక్షరాలు పెట్టించుకోటం– కబడ్డీ ఆటలో లావుగా ఉండే రాజుగాన్ని కాలుబట్టి లాగటం భలే గమ్మత్తుగా, ఆనందంగా అనిపించింది.

రానురాను పిల్లలందరికీ బుచ్చిగాడి మీద, వాడి చురుకుదనం మీద ఈర్ష్య మొలిచింది. మెల్లగా ఎగతాళి చెయ్యటం మొదలెట్టాడు. పిలకతో పిచ్చి పిచ్చి పేర్లతో పరిహాసమాడటం తనకు భరించరానిదైపోయింది. అయినా మాష్టారు మెప్పులు వీటన్నిటినీ అధిగమింపజేసాయి.

ఓరోజు మాష్టారు ఆప్యాయంగా పిలిచాడు. తన తెలివితేటల్ని ఆకాశానికెత్తాడు. పొగిసాడు. పొంగించాడు. అసలు విషయం మెల్లగా బయట పెట్టాడు. బాపునడిగి మొక్కజొన్న కంకులు తీస్కరమ్మన్నాడు. బుచ్చిగాడికి మాష్టారు మీద బాగా కోపం వొచ్చేసింది.

ఇంట్లో అడగలేక, మాష్టారి కోరిక తీర్చలేక వారంరోజులు స్కూలుకి వెళ్లకుండా తప్పుకు తిరిగాడు. ఎనిమిదోనాడు స్కూలుకి వెళితే మాష్టారు, ఏదో నెపంపెట్టి కొట్టిన దెబ్బలు బుచ్చిగాడిని చదువు నుంచే దూరం చేశాయంటే అతిశయోక్తిలా కనిపించినా పచ్చి నిజం అది.

అప్పట్నుంచి ఇంట్లో తెలియకుండా స్కూలుకి ఎగ్గొట్టడం మొదలెట్టాడు. ఏ పనీ నచ్చక, ఎవరితోనూ కలవక 'ఏకాకి'గా తిరిగేవాడు. సరిగ్గా ఆ సమయంలో ఎలాగైతేనేం బుచ్చి జీవితంలోకి ఓ పిల్లి ప్రవేశించింది. కొట్టొచ్చినట్టుండే నల్లటి మచ్చల్తో భీకరంగా వున్నా అతి దీనంగా ఉండేవి దాని కళ్లు. చూపులు. కాళ్లు మెడ మీద తెల్లగానే ఉంది. అయినా, దాన్నెవరూ పిలిచి పిడికెడెయ్య లేదు. అదే బలవంతంగా అంటిపెట్టుకుని ఉండేది. అక్కయ్యకు ఆ పిల్లి అంటే అసహ్యంగా ఉండేది. బుచ్చిగాడిని కూడా మొదట్లో ఆ పిల్లి ఆకర్షించనే లేదు. అప్పుడప్పుడు విసుక్కుని రాయితో కొట్టేవాడు. ఒకోసారి తన బతుకు, దాని బతుకూ ఒకలాగే అనిపించి కాస్త జాలిపడేవాడు కూడా.

ఓ రోజు ఓ వింత సంఘటన జరిగింది.

ఎవరో చిన్నపిల్లాడు, 'కర్రోడా' అని పిలుస్తూ బుచ్చిగాడి వెంటపడ్డాడు. చిన్న చిన్నగా రగుల్కొని కోపం మండిందేమో వాణ్ణి దొరకబుచ్చుకుని తల వొంచి వీపులో దిబదిబా గుద్ది ఇంట్లోకి పరిగెత్తుకొచ్చాడు.

పచ్చేసరికి అవ్వ బావికాడికి వెళ్లినట్టుంది. పక్కనే అర్రలో చప్పుడైంది. అక్క వంటింట్లో ఉందేమో. ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుంది ఇల్లు. చప్పుడైందని భయంభ యంగా తలుపు తీసి చూశాడు. పిల్లి ఎలక మీదికి దూకిందేమో చప్పుడైన ట్టుంది. పిల్లి నోట్లో ఎలక వేలాడుతూ వుంది. మూతి మీంచి నెత్తురు కారిపోతుంది. చూస్తుంటే బుచ్చిగాడి మనసు ఉడికిపోయింది.

వెంకటనే పిల్లిని కౌగలించుకుందామిపించింది. పిల్లి గొప్ప పని చేసిందనిపించింది. మెచ్చుకోవాలని అందుకోబోయాడు. పిల్లి పరిగెత్తింది.

బుచ్చికి అప్పటి నుంచి పిల్లి అంటే అభిమానం!

దానికీ, తన బతుక్కి ఏవో సామ్యాలు కల్పించు కుని పిల్లిని దగ్గర చేసుకోవటం మొదలెట్టాడు. తను తినేటప్పుడు దానిక్కొంత పెట్టటం– ముద్దుగా, 'నీలూ' అని పిలిచి దాన్ని తినమనీ, తనూ తినటం అల వాటు చేశాడు. రానురాను అదో అనుబంధంగా మారిపోయింది.

ఆమధ్య బడికెళ్లటం లేదని పసికట్టి బుచ్చిగాడి బాపు కర్ర తీసుకుని బాదాడు. బాదుతూనే బడిదాకా తీసుకెళ్లాడు. అయినా స్కూల్లో ఇముడలేకపోయాడు. ఆరోజు అన్ని దెబ్బలుపడ్డా అక్క, అవ్వ ఎవ్వరూ

నీలూ అరుస్తున్నట్టనిపించింది. వాళ్ల మీద కసి తీర్చుకోవాలనిపించింది. పరిగెత్తబోయాడు. కాలికి ఏదో తగిలినట్టయి కిందికి చూశాడు.

దగ్గరికి తీయలేదు. పిల్లి దగ్గరికి వొచ్చి నాకుతూ నిమిరింది. ఎంతగా దాని మనసు పంచిందో, హాయిగా అనిపించింది చచ్చిపోయిన నాయనమ్మ అప్పుడు కాసేపు కాపడం పెట్టింది.

ఆ తర్వాత ఇంటి మీద అలిగి చింతచెట్టు కిందే రెండ్రోజులున్నప్పుడు పిల్లే నీడగా వుంది. అసహాయ స్థితిలో బాధపడుతూ సానుభూతిగా తన పక్కే కూచుంది. ఆనాడు దాని మనసు గురించి ఆలోచిస్తుంటే 'నీలూ' అని పిలవాలనీ, దాంతో దోస్తీ చేయాలనీ ఏమేమో అనిపించింది. రోజురోజుకూ దాని గుణం, చేష్టలు మరింత నచ్చుతూ వొచ్చాయి.

అవ్వ రెండ్రోజుల్తర్వాత చింత దగ్గరికొచ్చి బతిమాలింది. తనని ఇంటికి తీసుకొచ్చింది. అదీ ముసలి దాని బాధపడలేక చేశారని బుచ్చిగాడికి తెలియదు. ఇంట్లో వాళ్ల మీదా కొంచెం కొంచెం ఇష్టం అనిపించింది. అదీ ఎన్నో రోజులుండలేదు. ఆరోజు రాత్రి తను పడుకుని నీలూతో ఆడుకుంటున్నాడు. అది తననూ, తను దాన్నీ బులిపిస్తున్నారు.

"బుచ్చీ" అని పిలిచాడు బాపు.

తను వెళ్లాడు. దగ్గరకు తీసుకుని ఆప్యాయత నంతా వెళ్లపోశాడు. 'మా మంచి బుచ్చీ' అని వీపు నిమిరాడు. "కాళ్లు లాగుతున్నాయి కాస్త తొక్కరా" అన్నాడు. తొక్కటం మొదలెట్టినా మనసు అనేక విధాలుగా పోతోంది. పిలిచి తొక్కమంటే కోపం వచ్చేది కాదు. కాసేపు మెచ్చుకుని పొంగించి చెబితే కోపం వచ్చింది. ఎందుకో ఆ అడగటంలో స్వార్థం కనిపించింది. తెచ్చిపెట్టుకున్న ప్రేమ కనిపించింది. బుచ్చిగాడి ఆలోచనల్లు విపరీతంగా ఉన్నాయి. అవ్వ అలాగే చేసింది.

చాలాసార్లు పిలుచుకుని పప్పులు పెడతానని ఆశ పెట్టేది. సాకలొళ్లింటికెళ్లి చీర ఉతికిందేమో తెమ్మనటమో, కుమ్మరొళ్లింటికెళ్లి తలంటు పోసుకోను మన్ను అడక్క రమ్మనటమో చేసేది. పని చెప్పటం తప్పనిపించక పోయినా ఆశ పెట్టటం–ఆప్యాయత చూపటం అంతా వాళ్ల అవసరాల కేనన్నట్లుండేది. అక్కయ్యా అంతే. అంతా అంతే. అందరిలో అదే గుణం. మనుష్యజాతి లోనే ఉంటుం దేమో. పిల్లిలో అదేదీ లేదు. అందుకే నీలూ కోసం తనేమైనా చేస్తాడు. నీలూ పొగడదు. పొంగిం చదు. అవసరానికి ఆప్యా యత నటించదు. నీలూ అంటే అంత ఇష్టమ్మరి.

బుచ్చి నేడిపించాలంటే ఎంత సులభమో ఆ ఊరందరికీ తెలుసు. నీలూని ఏ చిన్నగా హింసించినా తను బాధపడేవాడు. అక్కయ్య నీలూని చాలాసార్లు దాచేసి ఏడిపించేది తనని. వీళ్లందర్నీ కాదని ఒక పిల్లిని ఆరాధించటం ఎవరికీ ఇష్టం లేదు. ఓసారి కావాలని వాళ్లింట్లో వాళ్లే తన నీలూని దాచారు. ఆరోజంతా ఏడుపే. ఉపవాసమే.

ఎవరో తడుముతున్నట్టయి ఆత్రంగా లేచాడు బుచ్చి. పొద్దు బారెదుండు. దిగాలు పడ్డట్టు కళ్లు నులుముకుంటూ చూశాడు. ఎదురిం టి మంగడు. తనని ఎప్పుడూ ఏడిపించటానికే ప్రయత్నించే వాడు ఈ రోజు ఏడుపు ముఖం పెట్టాడు. గొంతు మెల్లగా బొంగురుగా పలికింది.

"చంపేసింద్రు" అన్నా బుచ్చి ఏమీ పలకలేదు.

"నీ నీలుని సంపేసింద్రు".

ఏమీ తోచలేదు బుచ్చిగాడికి. అర్థం కాలేదేదీ. చెవులు బద్దలౌతున్నట్టు. కళ్లు మంటలవుతున్నట్టు అనిపించింది.

"ఎవలు" గర్జించాడు మెరుపులాగ.

"దొమ్మరోల్లు"

"యాడ"

"గా మాదిగిండ్ల కవతలున్నరు. ఎక్కణ్ణుం చొచ్చిందో ఏమో పొదుగాల్నే మీ నీలు మా చొప్పాం కింద దాక్కుంది. అది దొమ్మరోల్లు జూసి ండ్రట. పట్కపోయిండ్రట. రొండు జాములకు మా అవ్వ జెప్పింది. నేనూ, మైసడు దొమ్మరి గుడిసెల కాడికి పోయినం. ఏం గన్పించలే. వాళ్లు పిల్లుల్ని కోస్కోని తింటరట. మీ పిల్లిని కూడా సంపోని తినొచ్చు."

బుచ్చికి మాట రాలేదు. నోరు పడిపోయింది. అణువణువూ ఏదో రకంగా ఏడుస్తున్నట్టు కసితో వూగిపోతున్నట్టు అనిపించింది. పండ్లు పగతో ఉక్కిరిబిక్కిరవు తున్నాయి.

పరిగెత్తాడు బుచ్చి.

దొమ్మరి గుడిసెల్లేవ్. మంగడు చూపించిన చోట ఏ గుడిసెలూ లేవు.

వాళ్లు భోజనాలు చేసి మకాం ఎత్తేశారని చెప్పారు పక్కనున్నవాళ్లు.

చూస్తూ బుచ్చి దీనంగా నిలబడ్డాడు.

నీలూ అరుస్తున్నట్టనిపించింది. వాళ్లమీద కసి తీర్చుకోవా లనిపించింది. పరిగెత్తబోయాడు. కాలికి ఏదో తగిలినట్టయి కిందికి చూశాడు. నీలూ కాలికి తను కట్టిన ఎర్ర గుడ్డపేగు, కాలి చివర్లు, చెవులు, తోక, చిన్న చిన్న భాగాలు కొన్ని ఉన్నాయక్కడ. అవి ఖచ్చితంగా నీలూవేనని గుర్తుప ట్టాడు. దోసిట్లోకి తీసుకుని అన్నిట్నీ

సంక్రాంతి అనగానే మనకు గుర్తొచ్చేవి భోగిమంటలు ..పిండివంటలు ..ధాన్యపురాసులు .. హరిదాసులు ..రంగవల్లులు ..గొబ్బెమ్మలు ..ఎడ్లపందాలు వీటితోపాటు పద్యతోరణాలు .. వచన కవితా పంక్తులు. అందుకే అక్షరయాన్ తెలుగు రచయిత్రుల ఫౌండేషన్ మీకు సవినయంగా అందిస్తోంది అక్షర కవితా రంగవల్లులను...

నిర్వహణ
- విశ్వేక,
అక్షరయాన్ ప్రధాన కార్యదర్శి

సంబరాల సంక్రాంతి

సులివెచ్చని భోగిమంటలతో
కొలని దేవరకు గొబ్బియలతో
కళాత్మకంగా తీర్చిదిద్దిన రంగవల్లులతో
కనువిందు చేసే
సాంప్రదాయ వస్త్రధారణతో
కన్నెపిల్లల కలల సంక్రాంతి!.
చిరుమువ్వల గంటల గంగిరెద్దులతో
హరిదాసు చిడతల తాళాల సంకీర్తనలతో
కళకళలాడే నిండైన ఇంటి సందడులతో
ఊరంతా సంక్రాంతి!
క్రొత్త బట్టలతో
పిండివంటలతో
గాలిపటాల ఎగురవేతతో
తోటివారితో కలిసిన కేరింతలతో
బాలలకు సంతోష సంక్రాంతి!
క్రొత్త ధాన్యం రాకతో
పొంగలి పరమాన్నాలతో
ఇంటిల్లిపాది విందుభోజనాలతో
రైతన్నకు సంబరాల సంక్రాంతి!
కోడిపందాలతో
క్రొత్త చలనచిత్రాలతో
కోరికలు తీరే వేళ
సరదారాయుళ్లకు
సరదాల సంక్రాంతి!.
ముచ్చటైన ముగ్గులతో
చక్కని బొమ్మల కొలువులతో
క్రొత్త చీరల రెపరెపలతో
మగువల మనసు
మురిసే సంక్రాంతి!
సంతానం రాకతో
ఇల్లంతా కళకళలతో
మనవళ్లు, మనవరాళ్ల
ముద్దుమురిపాలతో
అమ్మ మనసు సంక్రాంతే!
-చంద్రకళ.

మత్తకోకిల - మాలిక

వింత గాలిపటాలు త్రిప్పుచు పిల్లలందరు వేయు కే
రింతలన్ విని సంతసంబును వృద్ధలోకము పొందగా,
స్వాంతముల్ హరిదాసులప్పుడు సంతసింపగ చేయగా,
గంతులయ్యెడ వేయు పెయ్యల కాంచుచప్పుడు దివ్యమౌ
కాంతులీనెడి గంగిరెద్దుల గంట మ్రోతలు వీనులం
దెంతయో ముదమిచ్చుచుండగ; ఇచ్చకంబులు చెప్పుకొం
చింతులందరు ముగ్గు పెట్టుటకిండ్ల ముందర కూడ, సం
క్రాంతి పండుగ మాకు వేడుక కల్గ చేయదె ఎప్పుడున్.

భోగి మంటలు ఇంటింట బొమ్మల కొలు
వులును గాలిపటాల ఆటల అరుపులు
బందుగుల కలిసి తినెడి విందు లెంతొ
చక్కనివి కదా సంక్రాంతి సంబరములు
-పద్మినీ లక్కరాజు

ధాన్యలక్ష్మి అనుగ్రహం

పకృతి వరాల వేళ
పంట చేతికొచ్చిన
రైతు ఆనంద హేల
ధాన్యలక్ష్మి అనుగ్రహం

ధనలక్ష్మి సిరులు కురిపించే
రైతన్న పండుగ
ఊరంతా సంక్రాంతి పండుగ
ముంగిళ్ళలో రంగవల్లులు

తెలుగు లోగిళ్ళ ఆహ్వానం
నింగి అంటె సంబరం
భోగి మంటల భోగభాగ్యాలు
హరిదాసు సంకీర్తనలు
బసవన్నల సన్నాయి రాగం
పచ్చని పైరుల సందడి
పూజలందుకును కర్షకుని నాగలి.
-ఓదూరి రాధ

సంక్రాంతి లక్ష్మి

సంక్రాంతి లక్ష్మికి
శుభస్వాగతం
శ్రీలక్ష్మి మాఇంట పాదాలు పెట్టంగ
ఆనంద కాంతులే దిక్కులా నిండంగ
వరిపిండి ముగ్గుల నిగ్గుతెలిసి
గోమయ గొబ్బిళ్ళు పులకరించి
పలుకరించే ప్రతివధువులో!
పుత్ర వధువులు
గుచ్చి ఇచ్చిన పూగుచ్ఛాలు
మదినిమెచ్చి మావిపత్రాల
బంతిపూగుత్తుల తోరణాలు
గడపలకు
పసుపు కుంకుమలు
పూరేకుల అలంకరణలు
గాజుల మెట్టెల సవ్వడితో
పసుపు ఎరుపు రంగుల చీరెలేకట్టి
మంగళహారతి పట్టంగ
బంగారు పనివారి వెండి పట్టీలు కట్టి
వింతకాంతుల సంక్రాంతి పడతి
ప్రతిఇంట కుడికాలు పెట్టె
సంతోషం సంబరాలు మిన్నుముట్టే
-గంగరాజు పద్మజ

అక్షర సంక్రాంతి!

అహో!
వచ్చినదే అక్షర సంక్రాంతి
పౌష్యలక్ష్మి హేమంత సీమంత శ్రీలక్ష్మీ
సిరిసంపదలిచ్చే వరాల బంగరు లక్ష్మి
అక్షరాంజలులతో
అక్షరజ్యోతుల హారతులెత్తగా
అక్షర యాన్ గృహప్రాంగణమున
వచ్చినిలచినదే
విచ్చెను బంతి చేమంతి
అక్షర ముగ్గుల మాలికలు ఆప్యాయంగా
పెనవేసుకున్న భావాల కదంబాలు
గుమ్మడి పూలతో గొబ్బియలు
గోదాదేవి తిరుప్పావై సప్తపదులు
వీనులవిందులు సేయంగ..వచ్చినదే
గోమయము సున్నపురాయి ముగ్గులు
పర్యావరణ పరిరక్షణలో తోడ్పడునదే
భోగి మంటల్లో అసూయ కోపం ద్వేషం
కాలి కాలి నుసియై మంచి ముత్యాలు
మెరయునహో.
జలజల ఎర్ర ఎర్రని చిట్టి చిట్టి భోగిపళ్లు
పూలరేకులు చెరుకు ముక్కలు
గలగల తలపై నవ్వుతు దొర్లంగా
కిలకిల నవ్వులు కేరింతలతో
చిన్నారుల సందడి
బొమ్మల కొలువులు పేరంటానికి
అక్షర యాన్ అతివలందరూ వచ్చెనదే
అహో అంటూ మెచ్చే,రదే.
కుతకుతపొంగలి ఘుమాయింపుతో
కమ్మని అరిసెలు నువ్వులు బెల్లం ఉండలతో
సంక్రాంతి లక్ష్మి సంతోషాలే తెచ్చెనదే
గోమాత బసవన్నలకు పూజలు పూలదండలు
రైతన్నల నేస్తాలకు ఆప్యాయత తో
పరుగు పందాలు
కనుమునాడు ఇనుము అని గారెల ఆరగింపులు
పశువుల ఊరేగింపులు
కనుమునాడు కాకి కదలదని
ముక్కనుమ నాడు ప్రయాణాలు
వీడ్కోలు
ముచ్చటైన మూర్దోజుల పండుగ
అక్షర యాన్ లో చేసే బహునిండుగా
మళ్లీ వచ్చే సంక్రాంతికి కొత్త ముచ్చట్లతో
వచ్చునులే సంక్రాంతి
తెచ్చునులే శాంతి సౌభాగ్యాల సిరి
-అచ్యుతుని రాజ్యశ్రీ

మకర సంక్రాంతి శోభ

సూర్య భగవానుడు
మకర రాశి లో ప్రవేశించే సమయం
ఉత్తరాయణ పుణ్య కాలం
పసుగుమ్మాలు మామిడాకులతోరణాలు
బంతిపూల దండల అలంకరణలు
పేడ కళ్ళాపు జల్లుల వాకిళ్ళు
రంగు రంగులరంగవల్లులవాకిట
అతివలచేతినుండి జాలువారి
నర్తించేచుక్కలముగ్గులవేడుకలు
పుణ్య కాలం ప్రవేశించే వరకూ
ఉపవాసముండి
పసుపు, కుంకుమ పండ్లు దారపోసి
అందరికీ పంచుకొని
కొత్త బియ్యం
ఆవు పాలతో పొంగలిప్రసాదం,
పెద్దలకు కొత్త బట్టలు సమర్పించి
ఆశీర్వాదాలు పొందుట
పిండి వంటలనై వేద్యాలతో
కూతుళ్ళు, అల్లు ళ్లు,
కొడుకులు కోడళ్ళు,
మనుమలతో
ఇల్లంతా సందడి
మరదళ్ళు,బావలు,
బావమరుదులహాస్యాలు
కొత్త బట్టల వేడుక
కొత్త, పాత, అల్లుళ్ళకు
కట్నాలు కాను కలువేడుక
హరిదాసు కీర్తనలు
గంగి రెద్దు విన్యాసాలు
కోడి పందేలు,గాలి పటాలఎగరవేత
పేకాటలు ఎన్నెన్నో వేడుకల
ముచ్చట్లవెలుగుల సంక్రాంతి శోభ
సస్య లక్ష్మి ధాన్య రాశులు
ఇంటికి చేరే శుభ వేళ
మనసంస్కృతి, సాంప్రదాయాల
ఆనందం వెల్లివిరసే
ఆమకర సంక్రాంతి శోభ లలోని
సంతోషా లను వర్ణించతరమా!
- రేవిణి పాటి రమాదేవి

ఈ సారి నేనొస్తా.... మన పల్లెకు

చాలా కాలమైంది కదూ మిత్రమా....
ఈసారి సంక్రాంతికి మన పల్లెకు వస్తాను,
మన ఊరి చివర చెరువు
అలల ముఖంతో నవ్వుతూ,
చేపలకు నీటి పాఠాలను బోధిస్తుందంట కదా.
ఈత కొడుతూ, మనమూ నేర్చేసుకుందామా...?.
వేకువజామున రెక్కల చప్పుళ్లతో పలకరిస్తూ,
గగనానికీ, భువనానికీ మధ్య సంచరిస్తూ,
చిట్టి రెక్కల సీతాకోకలమై
ఎగిరిన ఆనాటి క్షణాలను
గుర్తుచేసుకుంటూ,
జ్ఞాపకాల చెట్టుపై వాలిపోదామా...?
ఈసారి వస్తాను,
మన ఊరి హరిదాసు కీర్తనలను వినడానికి,
రంగవల్లుల అందాన్ని మనసారా కనడానికి,
పంటలున్నాయా...? పక్షులున్నాయా...?
మన పల్లెలో పరవశించే మనసులున్నాయా...?!.
మిత్రమా!
ఇక్కడ నగరాన ఇళ్ళకైనా, మనసుకైనా
అన్నీ మూసుకున్న తలుపులే.
అక్కడ మన చిన్ననాటి,
వీధి అరుగు మీద
తల నెరిసిన అనుభవాల తలపులే..
చాలా ఇల్లు కూలిపోయి ఉంటాయి.
అయినా పర్వాలేదు
కూలిన శిథిలాల్లో
జ్ఞాపకాలను ఏరుకోవడానికి....
ఈసారి పల్లెకొస్తాను....
చెదిరిన మనసుతో ఓసారి వచ్చి
పారేసుకున్న నా బాల్యాన్ని
తిరిగి వెతుక్కుంటాను...
రామాలయం ముందు భోగి మంట
దాని చుట్టూ పెద్దలంతా చేరి
చలి కాచుకోవడానికి పడే తంటా...
ఇంకా ఉన్నాయా మిత్రమా...?
కనుమ రోజున కోడిపందాలు...
ముక్కనుమ రోజున ప్రభల తీర్థాలు..
ఇంకా జరుగుతున్నాయా నేస్తమా...?
కొత్తల్లుళ్లతో ఊరంతా
కాంతిగానే ఉంది కదూ...!
ఈసారి మాత్రం మన పల్లెను
ఓసారి చూడటానికి వస్తానే...
మళ్లీ తెలవారక ముందే
నగరానికి వెళ్ళిపోతాను!
ఎందుకంటే...
నేను వెనక్కి తిరిగి చూడలేను,
చూస్తే నా ఊరు
కంటి చెమ్మతో
నన్ను సాగనంపుతుంది.
-ఎన్. లహరి

సంక్రాంతి హేల

చలి పులిని తరిమికొడుతూ
తిమిరంతో సమరం చేస్తూ
భోగిమంటల కోలాహలంతో
దినకరుడిని మేలు కొలుపుతూ
అడుగిడింది సంక్రాంతి లక్ష్మి.
తెలి మంచు చీల్చుకుని
బద్దకంతో ఒళ్ళు విరుస్తున్న
భానుడికి స్వాగతం పలుకుతూ
ఇంటి ముంగిట తీర్చిదిద్దిన
రంగు రంగుల రంగవల్లికలు
గౌరమ్మకు ప్రతీకగా
మధ్యన గొబ్బిళ్ళు.
"హరిలో రంగ హరీ "అంటూ
హరినామ సంకీర్తనతో
పల్లెను మేల్కొల్పుతున్న హరిదాసు
డూ డూ బసవన్నల సన్నాయి రాగాలు
పండుగ సందడిని
పరవశంతో మోసుకొస్తున్న
పిల్ల తెమ్మెరలు
పెరట్లో అరిసెలు వండడానికి
కొత్త బియ్యం దంపుతూ
మగువల ముచ్చట్ల
సంబరాల సందడి .
డాబా మీద పతంగుల పోటీలతో
కుర్రకారు కేరింతల హోరు
కోడిపందాల జోరుతో
కోలాహలం సంతరించుకున్న ఊరు
వరండా వాలు కుర్చీలో
మీసాల చాటు
సంబరాన్ని దాచుకుంటూ
గాంభీర్యం నటిస్తున్న నాన్న
ఆప్యాయత అనురాగాలను
కలగలుపుతూ
కమ్మని వంటలు చేస్తున్న అమ్మ
పిండి వంటలతో విందు భోజనాల మధ్య
సరదా కబుర్లు
కొత్తగా పెళ్లయిన అక్కా బావల
సరస సల్లాపాలు
సాయంకాలం చిన్నారులకు
దిష్టి తీసి భోగి పళ్ళ పేరంటం
అటక మీది పాత బొమ్మలను దింపి
కొత్తగా కొన్న సీతారాముల బొమ్మను చేర్చి
సంస్కృతికి అద్దం పడుతూ
తీర్చిదిద్దిన బొమ్మల కొలువు
పట్టు చీరల రెపరెపలతో
చేతినిండా గాజుల గలగలలతో
మగువల పేరంటాల హడావిడి
పల్లె ముంగిట్లో పసందైన
సంక్రాంతి సందడి
పక్షుల కోసం ఇంటి ముంగిట
కట్టిన జొన్న కంకులు
పశువులను పసుపు కుంకుమలతో
అలంకరించి పూజలు
చేతి కందిన పంటతో
సంతృప్తి నిండిన గుండెతో
రైతు ఇంట సంక్రాంతి హేల
సంక్రాంతి హేల
చలి పులిని తరిమికొడుతూ
తిమిరంతో సమరం చేస్తూ
భోగిమంటల కోలాహలంతో
దినకరుడిని మేలు కొలుపుతూ
అడుగిడింది సంక్రాంతి లక్ష్మి.
తెలి మంచు చీల్చుకుని
బద్దకంతో ఒళ్ళు విరుస్తున్న
భానుడికి స్వాగతం పలుకుతూ
ఇంటి ముంగిట తీర్చిదిద్దిన
రంగు రంగుల రంగవల్లికలు
గౌరమ్మకు ప్రతీకగా మధ్యన గొబ్బిళ్ళు.
"హరిలో రంగ హరీ "అంటూ
హరినామ సంకీర్తనతో
పల్లెను మేల్కొల్పుతున్న హరిదాసు
డూ డూ బసవన్నల సన్నాయి రాగాలు
పండుగ సందడిని
పరవశంతో మోసుకొస్తున్న
పిల్ల తెమ్మెరలు
పెరట్లో అరిసెలు వండడానికి
కొత్త బియ్యం దంపుతూ
మగువల ముచ్చట్ల
సంబరాల సందడి .
డాబా మీద పతంగుల పోటీలతో
కుర్రకారు కేరింతల హోరు
కోడిపందాల జోరుతో
కోలాహలం సంతరించుకున్న ఊరు
వరండా వాలు కుర్చీలో
మీసాల చాటు సంబరాన్ని దాచుకుంటూ
గాంభీర్యం నటిస్తున్న నాన్న
ఆప్యాయత
అనురాగాలను కలగలుపుతూ
కమ్మని వంటలు చేస్తున్న అమ్మ
పిండి వంటలతో
విందు భోజనాల మధ్య
సరదా కబుర్లు
కొత్తగా పెళ్లయిన అక్కా బావల
సరస సల్లాపాలు
సాయంకాలం చిన్నారులకు
దిష్టి తీసి భోగి పళ్ళ పేరంటం
అటక మీది పాత బొమ్మలను దింపి
కొత్తగా కొన్న
సీతారాముల బొమ్మను చేర్చి
సంస్కృతికి అద్దం పడుతూ
తీర్చిదిద్దిన బొమ్మల కొలువు
పట్టు చీరల రెపరెపలతో
చేతినిండా గాజుల గలగలలతో
మగువల పేరంటాల హడావిడి
పల్లె ముంగిట్లో పసందైన
సంక్రాంతి సందడి
పక్షుల కోసం ఇంటి ముంగిట
కట్టిన జొన్న కంకులు
పశువులను పసుపు కుంకుమలతో
అలంకరించి పూజలు
చేతి కందిన పంటతో
సంతృప్తి నిండిన గుండెతో
రైతు ఇంట సంక్రాంతి హేల
-డా. కేతవరపు రాజ్యశ్రీ

పెద్ద పండుగ

పల్లె పల్లెలో వెలుగు
ధాన్యపు రాశుల సిరులు
గాదెలు నిండిన హంగులు
వచ్చినే పెద్ద పండుగ
సంక్రాంతి ఓ సంబరమై!.
పచ్చ పూల పరికిణీలు
ఎర్రమందారాల ఓణీలు
బుట్టచేతుల జాకెట్టులు
పెదాలపై గులాబీలు
ముద్దబంతుల కలలు
ఓ వైపు
భోగిమంటల చిటపటలు
డూ డూ బసవన్నల గంటల
గలగలలు
మాలక్ష్మి గజ్జెలపట్టీల రవళులు
మరోవైపు
ఇంటిముంగిట రంగవల్లులు
హరిలో రంగ హరీ ' అంటూ
హరిదాసుల కీర్తనలు
అమ్మ మెడలో ముత్యాల హారాల
ధగధగలు
తెచ్చినే పెద్ద పండుగ సంబరమై!
రోళ్లు రోకళ్ళు అరిసెల పిండి
టాల్కమ్ పౌడరుతో
కన్నె పిల్లల పిల్లకుప్పెల జడలతో
చెమ్మచెక్కల సయ్యాటలతో
ఓరచూపులతో బావలను కవ్వించే
మరదళ్ళతో
వచ్చినే వచ్చినే పెద్ద పడగ సంబరమై
మన సంక్రాంతి పండుగ!!
- లీల/ చామంతి

తెలుగు మధురిమలు

ధనుర్మాస ఆరంభంనుండి సంకరుడికి ఆహ్వానం
సూర్యుడు మకరరాశిలోకి సంక్రమిస్తే మకర సంక్రాంతి
భోగి మంటలతో శోభిల్లు భోగిపండుగ
భగ నుంచి వచ్చిన పదము భోగి
ధక్షిణాయనానికి చివరి రోజు భోగి
భగభగ మండే భోగిమంటల్లో పనికిరాని వస్తువులు కాల్చే రోజు
గోదాదేవి మహావిష్ణువును మెప్పించి పెండ్లాడిన రోజు
ధక్షిణాయనానికి చివరి రోజు
రంగనాథ స్వామితో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిన రోజు
భలిచక్రవర్తిని భూమికి ఆహ్వానించిన రోజు
శివయ్య వాహనం భువి నుంచి దివికి వచ్చికర్షకులను దీవించిన రోజు
రంగవల్లుల అందాలు ఆవు పిడికలతో
దండగా కూర్చి భోగిమంటల వెచ్చదనం పొందిన రోజు
తెలుగు మధురిమల బంతి పూల లోగిల్లు
కొత్త కాంతులు పంట ఇంటింటికి వచ్చే సంక్రాంతి
బొమ్మల కొలువుల వేడుకలు భోగిమంటలు కోడి పందాలు
పేకాటలు గాలిపటాల జోరు ఎ
ాడి పంటల పశువులను పూజించె కనుమ పండుగ
హరిదాసు కీర్తనలు గంగిరెద్దు ఆటలు కొత్త అల్లుల్ల సంభరాల సంక్రాంతి
పసిపాపలను విష్ణుమూర్తిలాభావించి భోగి పళ్ళు పోసే రోజు
కొత్త బియ్యం పొంగళ్ళు కమ్మనైన పిండి వంటల సంక్రాంతి
అంబరాన పతంగుల విహారం వీరంగం
అవనిపైన కోడి పందాల సమరరంగం
-నన్నపురాజు విజయశ్రీ

సంక్రాంతి కవిత

మంచు కురిసే ఉషస్సులో
తెలుగు మగువల తపస్సు
వాకిట్లో ముగ్గ మగువ
సౌభాగ్యానికి సూచిక
ఆమె సత్సంకల్పాలకు ప్రతీక.
ఏడాది పండుగ సంక్రాంతి
మన ఆశల పూలు పూసే శుభక్రాంతి
సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తూ
మన పురోగమనానికి శాసిస్తాడు....
కాలమెటు పయనించినా
నరుడు ఆనంద రాశిలో
ఆహ్లాద నక్షత్రంలో ,
సఫలాపేక్షలో సాగవలసిందే..
ఓ వైపు ముద్దబంతులు
మరో వైపు రంగుల ముగ్గులు
గుమ్మం ముందు గంగిరెద్దులు
చవులూరించే చకినాలు
చేతికందివచ్చే చేగోడీలు
కొత్త పండక్కి కొత్త అల్లుళ్ళు
అన్నీ మనల్ని
ఉరకలెత్తించేవే ఉత్సాహపరిచేవే...
మకర సంక్రాంతి శుభగడియలు
తెలుగు లోగిళ్లలో అమృత ఘడియలు.
-అపర్ణ. మధు.

సంక్రాంతి

బోడ పళ్ళూ...బోసి నవ్వూ,
కొత్త కుండా..కట్టె పొయ్యీ,
తీయటన్నం.... చెరుకు గడలు,
బోగి మంటా... పాల పొంగు,
తగ్గిపోయే వాడవాడన,
సంకురాతిరి వన్నెపోకే..
పల్లె సీమలో పాతబడకే
గంగిరెద్దూ....గంటమోత,
గాలిపటమూ... జానపదమూ,
రంగవల్లీ.... గొబ్బియల్లూ,
హరి కీర్తనం....బస్వన్న గీతం
సప్పుడే వినపడె అప్పుడప్పుడే,
సంకురాతిరి వన్నెపోకే....
పల్లె సీమలో పాతబడకే...
నేతి అరిసెలు...నూనె గారెలు,
నువ్వు పోలెలు....బెల్లపుండలు,
చేతివాటం తగ్గిపోయి,
ఆన్లైన్ సేవలు పెరిగిపోయే...
రుచులు తెలియని బాల్యమాయే,
ఫాస్ట్ ఫుడ్ లే పండగాయే,
సంకురాతిరి వన్నెపోకే....
పల్లె సీమలో పాతబడకే..
పట్టు పరికిణీ మెరుపులా,
గలగలగాజులా ముగ్గులా,
నింగినెగిరే పతంగిలా,
సంస్కృతీ సంప్రదాయాల శోభలా,
నడిచిరావే సంకురాతిరి....
మరిచిపోయే మనసుల్లోకి
నడిచిరావే సంకురాతిరి...
మరిచిపోయే మనసుల్లోకి.
-సుజాత శేర్ల.

ఎల్లెడల..క్రాంతి..సందడి

సంక్రాంతి..భోగభాగ్యాల సంబరం
రైతన్నల స్వేదం
ధాన్యంగా రూపుదిద్దుకుని
ఇంటికి చేరిన ధాన్యలక్ష్మి
ధనురాశి నుంచి మకరరాశిలోకి
ప్రవేశం..ఆయనాల మార్పు
దక్షిణాయనం నుంచి
ఉత్తరా యణం రంగు రంగుల ముగ్గులుబడిలో పిల్లలకి కడుపునింపే
కనికట్టు మాయాజాలం గొబ్బెమ్మలు
పండుగ సంబురాలు
కొత్త బట్టలు పిండివంటలు
కొన్ని ప్రాంతాల్లో కోడిపందాలు
జల్లికట్టు విన్యాసాలు
కొత్త జంటల సరాగాలు ఇంటింటా
సౌభాగ్యం నింపే పండుగ...
సాంకేతికత వృద్ధి అయినాకొద్ది
తెల్లారేసరికి..టీవీల్లో ముస్తా బయిన
ముదితల సంభాషణల
కోలాహలం
సంతోషపు జల్లులు
పండుగ సంస్కృతిని పోటీపడి
తేవటానికి మార్కెట్టుకు పరుగు
జనసందోహపుపద్మవ్యూహంలో
పేడ, గరిక,పిండిపూల కై..పాట్లు
జీవితం సాంకేతికతో నిండి
స్మార్ట్ గా వేగం తీసు కుంటుంది
అన్నంఎలావస్తుందో తెలియదు
ఐదువేళ్లు నోట్లోకి వెళ్లేక్రమంలో
చాయమాత్రంగా మరుగైతున్న
రైతన్న నోరుతిరుగని
ఇంగ్లీష్ పదాల దండయాత్రతో తెలుగు
కనుమరుగుగైతుంది..మనకు
తెలియకుండానే ప్రకృతి నుంచి
మననుంచి మనం దూరమై తున్నం..
దూరం చేసుకుంటు న్నాం..వనరులు..
-కొలిపాక.శోభారాణి

సంక్రాంతి

పంట చేతికొచ్చి ధాన్య సిరులతో
కళకళలాడుతున్న పల్లెలు !
సొంతూర్లకు పట్నం వాసులు !
పౌష్య లక్ష్మికి స్వాగతం పలుకుతూ
ముంగిట్లో రతనాల రంగ వల్లులు !
గుమ్మంలో గొబ్బెమ్మలు !
గగనంలో గాలి పటాలు !
ఇంతుల సౌభాగ్య నోములు !
శక్తిమేర దాన ధర్మాలు !
హరిలో రంగహరి అంటూ
హరిదాసుల ఆటపాట..
గంగి రెద్దుల దీవెనలు
పరికిణీల్లో పడుచు పిల్లలు
అల్లుళ్ళ హాంగామాలు !
కొంటె మరదళ్ళ కోలాహలం !
లతల మధురిమలు !
పాపాయిల కిల కిలలు !
రేగిపళ్ల బోగిపళ్ళు !
భోగి మంటల వెచ్చదనాలు
కాలానుగుణంగ
సంప్రదాయ గుమగుమలు !
మన పండుగలు శాస్త్రీయత నిక్షిప్తాలు !
సంస్కృతి ప్రతీకలు !
సనాతన ధర్మ సారథులు !
రవి మకర రాశి సంక్రమణం !
మార్పు సహజమని చెప్పే తాత్వికత !
ఆత్మీయానురాగాలకు నెలవు
తెలుగు లోగిళ్లు!
-శైలజ రాంపల్లి

సంక్రాంతి సంరంభం

'సం' అంటే మిక్కిలి, 'క్రాంతి' అంటే అభ్యుదయం.
మంచి అభ్యుదయం కలిగించే విశిష్ట పర్వదినం సంక్రాంతి.
భానుడి మకరరాశి ప్రవేశం,
ఉత్తరాయణ పుణ్య కాలం ఆరంభం.
ముందు భోగి, తరువాత కనుమలతో రాజసంగా
సంక్రాంతి ఆగమనం.
కష్టపడి రైతన్నలు పండించిన పంట ఇళ్ళకు చేరే సమయం.
అందమైన రంగవల్లులతో పలుకుతారు ధాన్యలక్ష్మికి స్వాగతం.
ధనాన్ని కురిపించే ధాన్రపురాశులతో నిండిన
గృహాలకు పచ్చని బంతిపూల తోరణాలతో ధనలక్ష్మికి ఆహ్వానం.
పాడిపంటలు నిచ్చే పశుసంపదను కనుమనాడు
పూజాదికాలతో కృతజ్ఞతాభివందనాలు.
రంగురంగుల రంగవల్లులు, అందమైన గొబ్బెమ్మలతో
సంక్రాంతికి నీరాజనాలు.
మొగలి పువ్వంటి మొగుడిని ఇమ్మంటూ కన్నెపిల్లల
గొబ్బి పాటల సందడులు.
పిల్లాపాపలకు భోగిపళ్ళతో దిష్టితీతలు,
పెద్దలఆశీస్సులు, దీవెనలు.
పసుపుకుంకుమలు, పూలు, గాజులతో
ముత్తైదువులకు వాయనాలిస్తూ, సుమంగళిత్వానికి
సౌభాగ్య లక్ష్మికి వేడుకోళ్ళు.
పితృదేవతల పూజలతో స్వర్గీయులకు తృప్తి ప్రధానాలు.
దానధర్మాలతో దారిద్ర్యానికి వీడ్కోలు చెప్తూ, పుణ్య
సంప్రాప్తికై నోములు వ్రతాలు.
ప్రాంతీయ ఆచారానుసరంగా, చక్కిలాలు, అరిసెలు,
నువ్వుల వంటలతో పసందైన విందులు, కోడిపందాల వినోదాలు.
ఆకాశంలో పతంగుల విహారాలు, కుర్రకారు ఆనందోత్సాహాలు.
క్రొత్త అల్లుళ్ళకు అత్తింటివారి ఘనమైన మర్యాదలు,
ప్రేమపూర్వక కానుకలు.
ఒకటా రెండా, అన్నిరకాల సందడులతో సంక్రాంతి పర్వదినం...
పల్లీయులకే కాదు పట్టణ వాసులకూ ప్రియమైన శుభకరం.
ఆటపాటలతో, సరదాసందడులతో సర్వులకూ ఆనందదాయకం.
ఈ 'సంక్రాంతి సంరంభం' కవిత నా స్వీయ రచన.
-ఉమాదేవి ఇల్లెందుల.

మార్పు సహజం

కాలానుగుణంగా
నెల నెలకు రాశి రాశికి
రవి పయనం
ప్రతి నెలా సంక్రాంతి
మకర రాశిలో ప్రవేశం
దిశ మారిన భాస్కరాయణం
మకర సంక్రమణం!!.
ముంగిట
ముత్యాల ముగ్గుల అందం
బంతిపూల
తోరణాల సోయగం
భోగి మంటలతో
చలికి వీడ్కోలు
పిండి వంటలు రుచులు
భోగి భాగ్యాల తేరు
ప్రజల అనుభవాల తీరు!!.
భోగిపండ్లతో సందడి
నోముల వ్రతాలతో
అతివల ఆనందం
పతంగుల కోలాహలం
డూడూ బసవన్నల
విన్యాసం!!.
బొమ్మల కొలువులతో
ఇంటింటా సంబరం
పాడిపంటలు ఇంటికి చేర
రైతన్న కంట వెలుగు
ఊరంతా జిలుగు!!.
కొత్త అలుళ్లతో
ఇల్లంతా సందడి
పితృ తర్పణాలతో
పితృ దేవతలకు తృప్తి
ఆటపాటలతో
ప్రజల కన్నుల్లో నిజమైన కాంతి
బ్రతుకు తెరువుపై విశ్వాసం
కాలానుగుణంగా
మార్పు సహజం!!.
పాతను పాతరేసి
కొత్తదనాన్ని ఆస్వాదిస్తూ
సరైన దారిలో పయనించినప్పుడే
క్రాంతి అంటేనే
అభ్యుదయం
కాంతి ఉంటేనే చైతన్యం
కాంతతోనే ఉత్సాహం
ప్రకృతి పరిరక్షణనే ధ్యేయం!!.
దక్షిణలు ఆశించక
పనులు చక్కదిద్దినప్పుడు
మార్పు మంచి మలుపుకు
దారిదీపమైతే
అందరి మదిలో
సంక్రాంతి శోభలే!!.
-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

సంక్రాంతి మణిపూసలు

ఏడాది మారిన
ప్రతి యేడు
సంక్రాంతి పండగ
మాకు కొత్తనే .
ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మ
పసుపు కుంకుమతో, పూలతో
నవధాన్యాలతో అలంకరించుకొని
అందమైన రంగవల్లుల
ఒడి లో ఆసిన్నం చేసి
వాకిలిని అందచందాలతో
అలంకరించడము
ప్రతిసారి మాకు కొత్తనే.
హరిదాసుల హరినామ
సంగీత విభావరి తో
ముంగిట్లోకి వచ్చిన
వారికి ధాన్యం ఇవ్వడమూ మాకు కొత్తనే.
ముత్యాల ముగ్గులతో
ముస్తాబై ఇంటి ముంగిట
ఆడే డూ డూ
బసవన్న నాట్యం
మాకు కొత్తనే .
పసిసిల్లల బోసినవ్వులను
భోగి పండ్లతో
భోగభాగ్యాలు కలగాలని ఆశీర్వచనాలతో
ఆశీర్వదించడము మాకు కొత్తనే .
కష్టాలు తొలిగిపోవాలని
కన్నీరు దరిచేరద్దని
కొత్త సంవత్సరపు నూతనత్వతో
జీవితాంతం సుఖ సంతోషాలతో
ఉండాలనిపాత వస్తువులను
భోగి మంటలలో వేసి
చలి కాచుకోవడము
మాకు కొత్తనే
ఏడాదంతా కష్టపడి
సంపాదించిన పంటను
గుమ్మిలో నింపి
ఏటా మంచి పంట పండాలని
ఆశపడుతూ భూమి తల్లికి
కాడెద్దులకు, మొక్కే
రైతన్నల మొక్కులు
మాకు కొత్తనే
పండుగనగానే
కొత్త బట్టలు
పిండి వంటలు
బంధువుల పలకరింపులు
మాకు కొత్తనే
ఏడాది మారిన
ప్రతి ఏడు
సంక్రాంతి పండగ
మాకు కొత్తనే
-జోరు.పవిత్ర క్రిష్ణ

సంక్రాంతి

సంక్రాంతి సంబరాలు
ఇంటింటా కోలాహలాలు
పాశురాల గానాలు
హరిదాసుల ఆలాపనలు
పిల్లల ఆటపాటలు
భోగి పళ్ళు గొబ్బిళ్ళ సందోహాలు
భోగిమంటల వెచ్చదనాలు
కొత్త బట్టల రెపరెపలు
పిండివంటల ఘుమఘుమలు
ప్రసాదాల పరిమళాలు
కొత్త అల్లుళ్ల కు మర్యాదలు
కొత్త కోడలి వయ్యారాలు
మనవల నయాగారాలు
పెద్దల ముద్దు మురిపాలు
ఆగని కోడిపందాలు
పేకాటరాయుళ్ల అరుపులు
యువత కేరింతలు
బంధుమిత్రుల కలయికలు
వచ్చే ఏటి పండుగ కోసం
ఎదురుచూపులు.
-నాగ దీప్తి

సంక్రాంతి

వచ్చింది వచ్చింది ఊరంతా సంక్రాంతి
తెచ్చింది తెచ్చింది జనజీవనమునకు క్రాంతి.
తొలికోడి కూతల్లు హరిదాసు భజనల్లు
లోగిళ్ళో ముగ్గుల్లు ముగ్గులలో గొబ్బిళ్ళు.
అల్లంత దూరాన దేవాలయమ్ములలో
గోదమ్మ చెప్పినా తిరుప్పావై పాశురమ్ములు
గానమ్ము చేస్తున్న అర్చకులు, భక్తులూ.
గొబ్బిళ్ళ పాటల్లు వీధంతా సందళ్ళు
పల్లెలలో పరువాల పడుచుల్ల పరవళ్ళు
పిలలల కేరింతల్లు పతంగుల ఆటల్లు.
తెలవారు ఝామున్న భోగిమంటల్లోన
చలి కాచుకుంటున్న పిన్నలూ, పెద్దలూ
సందు గొబ్బెమ్మంటూ గొబ్బి పేరంటాలు
చిన్నారులకు భోగిపళ్లు పేరంటాలు.
మకర సంక్రాంతి కనుమ ముక్కనుమంటూ
కోళ్లపందేలూ, ఎడ్ల పందెములతో
పల్లె ప్రజనానంద పరవళ్ళు త్రొక్కిస్తూ
వచ్చింది వచ్చింది ఊరంతా సంక్రాంతి
తెచ్చింది తెచ్చింది
జనజీవనమునకు క్రాంతి
-బి. లక్ష్మీ శేషాచార్యులు

సంక్రాంతి

ధనుర్మాసం వచ్చిందంటే
పసిడి పంటల వెల్లువలు
నెలగంట పట్టడమంటే
రంగు రంగుల రంగ వల్లులు
ముగ్గుల మధ్య గొబ్బిళ్ళు
గొబ్బిళ్ళ కొప్పులో ముద్ద బంతి పూలు
గొబ్బిళ్ళ చుట్టూ ముద్దుగుమ్మల నాట్యాలు
పట్టు పరికిణీల గరగరలు –
పడతుల మధ్య కిలకిలలు
కొత్త అల్లుళ్ళ అలకలు– సంక్రాంతి కానుకలు
బావా మరదళ్ళ పరిహాసాలు
బావమరుదుల బహుమానాలు
పిండి వంటలు – పరమాన్నాలు
సూర్యభగవానునికి – నైవేద్యాలు
ప్రతి ఇంటా – అరిసెల వంటలు
గంగిరెద్దుల – నాట్యాలు
గాలి పటాల నృత్యాలు
హరిదాసుల గానాలు
భోగి మంటలలో–పిడకల దండలు
బొమ్మల కొలువులు – భోగి పళ్ళు
గోదా దేవీ కళ్యాణం
సంక్రాంతి నాటి ముచ్చట్లు
పితృదేవతలకు పెట్టుపోతలు
నూతన దుస్తుల సమ్రంభాలు
రక రకాల పిండి వంటలు
సాగు చెయ్యటంలో సాయ పడిన
మూగ జీవాలకు పూజలు
కళకళలాడే ప్రతీ ఇల్లు
రథము ముగ్గుతో సాగనంపుతూ
రాబోయే యేడాదికి ఎదురుచూపులు
–అద్దేపల్లి జ్యోతి

వర్ణరంజితం పల్లె దారి

పొద్దుగా పట్నంలో
సం, గానే సంక్రాంతి
అది పల్లెదారి పట్టింది
ఉన్నకాస్త సెలవులు
హ్యాపీ గా ఉన్నతంగా
గడిపాలన్న సంతృప్తి కోసం
ఎప్పుడెప్పుడా అని
పట్నం దాదాపు సగం అయ్యింది
ఎంత కష్టమైన సాలుకోసారి
తమ వారికై తమ ఊర్లకు
పరుగు పెట్టించింది
రకరకాల పంటలకు లోగిళ్లు
ప్రేమ ఆప్యాయతలకు పొదరిండ్లు
మామతానురాగల మగాణులు
పట్నవాసంలో లేదీ ఆచూకీ
భోగి మంటల్లో ఆహాన్ని వదిలి
కుటుంబ ప్రేమ వెచ్చదనం పంచుకొని
కళ్ళా పి చల్లిన ముంగిళ్ళు
పచ్చతోరణాల స్వాగతాలతో
పల్లెతల్లి రారమ్మని
తన ఒళ్ళోకి పిలుస్తుంది
సంప్రదాయ పరికిణి ల్లో
గాజుల గలగల్లో
మంజీరాల సవ్వడిలో
ముంగురుల సవరింపులతో
ఆడపడుచుల అందమైన
దృశ్యమాలిక అల్లుతుంది
బసవన్నల రాక కోడిపందెలు
గాలిపటాల జోరు దానికి తోడు
మ్యూజిక్ హోరు లో
నిమగ్నమైన యువత
పిండి వంటలు నువ్వులడ్డూ లతో
వర్ణ శోభితమే వడ్డించిన విస్తరి
పంటల్లో ముఖ్య భూమిక
పశువులు వాటి గుర్తింపుకై
అలంకరించి పూజించుట
కనుమ వేడుక కనువిందు సాంప్రదాయం
తమ వారికోసం తమ పల్లెకు
రప్పిస్తున్న సంక్రాంతి పండుగ
పల్లెదారి పట్టిందనటంలో
సందేహమే లేదు.
–సంధ్య సుత్రావె

సంక్రాంతి

ముత్యాల ముగ్గులు పెడుతూ
గొబ్బెమ్మలను అలంకరిస్తూ
అమ్మాయిలు నవ్వుతూ
తుళ్ళుతుంటే
సూరీడు ఉత్తరాయణం గుర్తు చేసుకుని
హుషారుగా సాగుతూ
చూపులు సారిస్తూ
పల్లె ముంగిళ్ళ ముస్తాబుకు
అయ్యాడు ఫిదా
హరిలో రంగ హరీ ..
హరిదాసుల సందడికి
సూరీడి మది అయింది
ఆనందాకాశం
ప్రతి గుమ్మానికి
బంతి పూల తోరణాలు
లోగిళ్ళలో బంధువుల కోలాహలం
తలంటు స్నానాలు..
కొత్త బట్టల సింగారాలు
వాకిట్లో
దూ దూ బసవన్నల విన్యాసాలు
కళ్ళింత చేసుకు చూస్తూ
సూరీడి పయనం
రైతుల ఇంట ధాన్యపు రాశుల కళకళ
పక్షుల కోసం వాకిళ్ళకు కట్టిన కంకులు
కొత్త బియ్యంతో పొంగళ్ళ రుచులు
తీయతీయని అరిసెల
ఆరగింపులు
సంక్రాంతి వేడుకందు
వింతైన వంటకంబు..
పాడుకుంటూ
కళ్ళతోనే ' విందు '
చేసుకుంటూ సూరీడు
గగనంలో పతంగుల సయ్యాటలు
సూరీడుకయ్యాయి నేత్ర పర్వాలు
సాయంవేళ భోగి వేడుకలు
బొమ్మల కొలువులు
పేరంటాల సందళ్ళు
ఆత్మీయ కలయికలు
సరదా సంభాషణలు
సంక్రాంతి వీక్షణానికి
వీడ్కోలు పల్కలేక
సూరీడు తప్పదన్నట్లు
మందగమనంతో
మందహాసాలు చిందిస్తూ
మానవాళిని ఆశీర్వదిస్తూ
పడమటి దిక్కుకు..
–జె.శ్యామల

సంక్రాంతి

సంకురాత్రి ఆగమనం సంక్రాంతి
సంతోషాలతో ప్రభంజనం
సరదాలకు ఆలవాలం !
అల్లుళ్లకు ఆశలు ఆకాశాన్నంటు
అత్తల మురిపాలు జామాతలంటూ
అడిగినవి తప్పనిసరంటూ !
మధ్యలో బసవన్న దూడూలు
సన్నాయి మేళాలు సరిగమలు
మగువలకు అలంకరణ తొందరలు !
హరిలో రంగ హరి అనగా
అందరూ హరిదాసు వచ్చెనే
హద్దులేని సంతోషాలు తెచ్చెనే !
తరుణులు దిద్దే రంగవల్లులు
క్షణం తీరికలేని ఆడపిల్లలు !
సంతోషాలమయం
సకల సంపదలకు ఆలవాలం
సర్వులకూ సౌఖ్యాల వర్షం !
భోగి పళ్ళు సందడి
పసికూనలకి దీవెనలు
సంతోషాతిరేకాలు కోకొల్లలు!
మూడు దినములు
బొమ్మల కొలువులు
పరికిణీ రెప రెపలు !
కొత్తబట్టల అందాలు
కోడళ్ళ పేరంటం
కొదవలేని తాంబూలాల పంట !
పతంగాల పందాలు
బోగి ,సంక్రాంతి. పెద్దలపండుగ ,
పదిమందికి ఆనందాలు ఉప్పొంగ !
– కె.కె.తాయారు

సంక్రాంతి శోభలు'

పొంగి పొరలును పాడి పంటలు
ప్రగతి పథాన పడతుల ముగ్గులు
ముంగిట నిలుచును యింపుగ గొబ్బెమ్మలు
వెల్లి విరియును సంక్రాంతి సిరులు!.
నింగిన ఎగురును రంగుల పతంగులు
ఘుమఘుమ లాడును పిండి వంటలు
నిండుగ పూయును నవ్వుల పువ్వులు
వేడుక గొలుపును మరదళ్ళ అల్లరులు
ఇంటింటా కొలువు తీరును చక్కని బొమ్మలు
పండుగ సందడితో నిండును పల్లె పట్నాలు!.
గెలుపు ఓటముల కోళ్ళ పందాలు
కొత్తల్లుళ్ళను స్వాగతించును అత్తారిళ్ళు
ఆట పాటలతో యువతీ యువకులు
పాత కొత్త తరాల మేళవింపులు
వణికించే చలిలో బోగి మంటలు
సంస్కృతీ సంప్రదాయలకు నెలవులు!.
పిల్లలకు హాయినిచ్చును పండుగ సెలవలు
ఎల్లరకు సంతసమిచ్చును
ఈ పండుగ రోజులు!
–వి.వి.వి.కామేశ్వరి (ఎన్)

సంక్రాంతి సంబురం

ధనుర్మాసము లోన వచ్చె
తెచ్చనిక మూడు రోజుల
ముచ్చటైన ముగ్గుల పండుగ
ప్రతి ఇంట వెలుగులు నింపగా
వచ్చే గొబ్బెమ్మ పండుగ
ముంగిట రంగవల్లులతో
గుమ్మాలకు బంతిపూలతో
మగువల వెలుగులతో
ముస్తాబు అయిన మురిపాల పర్వం
ఇంటింటికి గంగిరెద్దులతో
హరిదాసుల రాకలు
అంబపలుకు జగదంబపలుకుతో
గోమాత ఆశీర్వచనాలు
నువ్వుల ముద్దతో తలంటడాలు
నూతన వస్త్రములతో అలంకరణలు
అక్క తమ్ముళ్ళ అనురాగాలు
అన్నాచెల్లెళ్ల మమకారాలు
అతిథులతో నెలకొన్న ఆప్యాయతలు
నవధాన్యాల గొబ్బెమ్మలతో
ఇంటినిండా కాంతులు
మామిడాకుల తోరణాలు
కలగూరలతో పలహారాలు
గారెలతో రుచులు
పాయసాలతో ఘుమఘుమలు
సంతోషంతో పిల్లల కేరింతలు
వారెవ్వా అనిపించు తీపిరుచులు
భోగి మంటలతో మానసిక చైతన్యం
బొమ్మల కొలువుతో చక్కటి ఆహ్లాదం
నింగిన గర్వంగా మురిసే గాలిపటాలు
బాలబాలికలలో పెంచెను ఆత్మవిశ్వాసం
ఊహాశక్తి,సృజనాత్మకతని పెంచే పండగ
తెలుగువారి క్రాంతిని పంచే పండుగ
తెలుగు సంస్కృతిని చాటే పండుగ
అనురాగాన్ని,ఆత్మీయతని పంచే పండుగ !
అదే సంక్రాంతి ...
అదే అదే సంక్రాంతి పండుగ !!
– సునీత బందారు

సంక్రాంతి శోభ

దినకరుని రథం దిశ మరలిన వేళ
మకరరాశిన రవి అడుగిడిన వేళ
ధాన్య లక్ష్మి మోము రంజిల్లు వేళ
ఏతెంచె వేయి వెలుగుల సంక్రాంతి.
వేయాలి స్పర్ధా ద్వేషాల వ్యర్థాలతో భోగిమంటలు
కరగాలి మిథ్యాడంబరాల మంచుతెరలు
అనురాగాలరంగవల్లికలతో
శోభిల్లాలి హృదయాంగణాలు–
ప్రతి ద్వారాన కదలాలి ప్రగతి తోరణాలు
సొంపైన గాలిపటాల సామూహికనృత్యం
నభోవీధిని అలరించే అద్భుత దృశ్యం
చూడచక్కని బొమ్మలకొలువులు
బసవన్నల మెడల పూదండలు
పల్లెల్లో పరిమళించు వేడుకలు–వాడుకలు.
మాయని సంస్కృతికి దర్పణాలు.
–జంధ్యాల కుసుమ కుమారి

పండుగ సందడే సందడి

ఊరు వాడా సందడే సందడి
పంట చేటికొచ్చి రైతు మురిసే
సందడే సందడి
పట్నం,పల్లె అందాలుతోమురిసే
సందడే సందడి
కొత్త సంవత్సరం కొత్త దంపతుల రాకలతో
కొత్త అల్లుడు ,కొత్త కోడలు,
వియ్యంకులు రాకపోకలతో
సందడే సందడి.
కొత్త పాడి పంటలు
ముంగిట రంగవల్లులు గొబ్బెమ్మలు.....
గుమ్మాలకు మామిడి తోరణాలు,
పూమాలలతో
సందడే సందడి .
తెల్లవారు ఝామున
అభ్యంగనస్నానం ఆచరించడం
కొత్త బట్టలు, ధరించి ,
దైవదర్శనం, పూజలు నిర్వహించి
పిండి వంటలు,చేయటం
బంధువుల రాక పోకలతో
బవవన్న ,హరిదాసుల కీర్తనలతో ,ఊరంతా
సంక్రాంతి పండుగ
సందడే సందడి
–మాణిక్య లక్ష్మి

పెద్ద పండుగ

పెద్ద పండు గ వస్తోంది
మూడు రోజుల సందడి తెస్తుంది
ధాన్యలక్ష్మి ,ధనలక్ష్మి
జంటగా ఇంటికి రాగా
యజమాని మోము ఆనందంతో
కళకళలాడుతుంది
కన్న బిడ్డలు ,వారు కన్నబిడ్డలు ,
జీవిత భాగస్వాములతో
పండుగకి తరలిరాగా ,శ్రమ పెరిగినా
ఇల్లాలు సంబర పడిపోతుంది
దిష్టి పోవాలని పిల్లలకు భోగి పళ్లు ,
చలిపోవాలని అందరికీ భోగిమంటలు
కాకిరూపు పోవాలని పిల్ల, పెద్దల కనుము స్నానాలు.
కుప్పనూర్పిళతో దిక్కు తోచక ఊరిపై పడిన
దోమల, నుసుల్ల ,క్రిమికీటకాల నివారణకు
పేడనీళ్ళ కళ్ళాపులు,
ఇంటి ముంగిట ముగ్గుతో రంగవల్లులు,
మధ్యలో కనులకు అందం,
ప్రశాంతత నిచ్చే గొబ్బెమ్మలు .
శరీరానికి అవసరమయ్యే నువ్వుండలు ,
అరిసెలు ,చకినాలు
అన్నీ సంప్రదాయ,ఆరోగ్య ప్రతీకలే .
కోడిపందాలు ,ఎడ్లపందాలుతో
పల్లెలు సందడి చేస్తుంటే
కష్టమైనా ,కూడదని తెలిసినా
ఇష్టముగా పాల్గొనే జనాలు .
హరిదాసుల కీర్తనలు ,తోలుబొమ్మలాటలు ,
కన్నులకు,వీనులకు విందు చేయగా
పరవశిస్తాయి ఆనందముతో అందరి మనస్సులు .
నింగి కేగిరిన పత0గులు
మన చంద్రయాన్,ఆదిత్య ,ఆస్కార్ ,
క్రీడల్లో పసిడి పతకాలను గుర్తు చేస్తుంటే
గర్వముగా,ఆనందముగా
ఈ సంక్రాంతి తెచ్చే కొత్త కాంతికి
ఆత్రముగా ఎదురు చూస్తున్నారు జనులందరూ .
–ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

సంక్రాంతి సంబరాలు

ఉత్తరాయణ పుణ్యకాలంలో
సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే
భోగి మంటల వెచ్చదనంలో రావమ్మా సంక్రాంతి లక్ష్మి
అన్నదాతల ఇంటికొచ్చే కొత్త పంటలతో
భోగి పండుగ తెస్తుంది భోగ భాగ్యాలు.
గుమ్మాలకు మామిడి తోరణాలు
ముంగిట్లో అందమైన రంగురంగుల ముగ్గులు
ముగ్గుల నడుమ కొలువైన గొబ్బెమ్మలు
హరిలో రంగ హరీ అంటూ
విన సొంపైన హరిదాసుల కీర్తనలు
రంగురంగుల దుస్తులతో, కొమ్ములకు మెరుపు కాగితాలతో
కాళ్లకు గజ్జెలతో గంగిరెద్దుల విన్యాసాలు
రేగిపళ్ళు, బంతిపూలు చెరుకుముక్కలతో
చిన్నిపాపలకు భోగిపళ్లు.
పట్టు పరికిణీలతో అమ్మాయిల హ్యాయలతో
ముత్తెదువుల పూజలు, నోములతో
మకర సంక్రాంతి తెస్తుంది సకల సిరి సంపదలు.
కొత్త బియ్యం పాల పొంగళ్ళ నైవేద్యాలతో
ఘుమ ఘుమలాడే పిండి వంటలతో
కొత్త అల్లుళ్ల చిరు చిరు అలకలతో
కొంటె మరదళ్ల చిలిపి మాటలతో
గృహాలన్ని సంక్రాంతి శోభ సంతరించుకునే.
పతంగుల పోటీలు, ఎడ్ల బండ్ల పోటీలు
పశువుల అలంకరణలు, కోడిపందాలు
కనుమ నాటి ప్రత్యేకతలు.
ఆలయాల్లో గోదా శ్రీరంగనాథుల కళ్యాణంతో
అంబరాన్నంటే సంక్రాంతి సంబరాలు.
–వేముల ప్రేమలత

సంక్రాంతి

శోభకృత్ నామ సంవత్సరాన
శుభమస్తుమంటూ కోవెలగంటలు మ్రోగగా
శుభాలనొసగుచూ దీవెనలందించగా
శుభ సంక్రాంతి వచ్చేనదిగో !!
వచ్చేనదిగో సంక్రాంతి పండుగ!!
ధాన్యపు రాశులు గాదెలు నింపగా
కాసుల గలగలలు సిరుల రాసులవ్వగా
ఇంటిముంగిట రంగవల్లులు కళకళ లాడగా
పచ్చని మామిడి తోరణాల స్వాగతం పలుకగా
వచ్చేనదిగో సంక్రాంతి పండుగ ॥.
నింగిని తాకే రంగు రంగుల గాలి పటాలు !
పౌరుషానికి మారుపేరు కోడి పందాలు !
ఉదయాన్నే మేల్కొలిపే హరిదాసు కీర్తనలు!
గంగిరెద్దుల దూడూ బసవన్న ఆటలు!
వచ్చేనదిగో సంక్రాంతి పండుగ!!.
పిల్లాపాపల సందళ్ళు హాయి గోల్పగా
మకర రాశిలో అడుగు పెట్టె భాస్కరుడు !
ఉత్తరాయణ పుణ్యకాల
ప్రవేశ శుభవేళ .....
గోదాదేవీ రంగనాథుల
కళ్యాణ ఆహ్వానము పలుకగా .....
వచ్చేనదిగో సంక్రాంతి పండుగ !! .
కొత్త అల్లుళ్ల ఆగమనం....
కొత్త వస్త్రాల మెరుపులు ....
కొత్త పంటల కోతలతో రైతులు.....
కొత్త అందాలతో మెరిసే పల్లె సీమలు !!
వచ్చేనదిగో సంక్రాంతి పండుగ!!.
చలిని పారద్రోలే భోగి మంటలు !
చిన్నారుల భోగి పళ్ల సందళ్ళు!
కొలువైన బొమ్మల కొలువుల లోగిళ్లు!
కనుమ నాటి పశుపక్ష్యాదుల కోలాహలం !
వచ్చింది వచ్చింది సంక్రాంతి పండుగ!
–మణినాథ్ కోపల్లె

సంక్రాంతి

ఆయనాల మార్పులు, ఖగోళాల సంచారాలు
రాశుల గమనాలు వెరసి సంక్రాంతి సొబగులు
దక్షిణాయనపు కట్టకడపటి భోగి ఘడియలు
ఉత్తరాయణనానికి నాందీ ద్వారాలు
పొద్దుపోయే వేళకి మండువా లోగిళ్ళు
అంతటా నిండెను పంటల్ల మోపులు
వడ్లగింజలతో బరువెక్కేను ధాన్యాగారాలు
తొలి బియ్యపు మెతుకులతో పరమాన్నాలు.
హరిహరుల స్తోత్రాలు, భక్తుల పారాయణలు
శ్రీ ధర్మశాస్తుని అనుంగు అనుచరులు
పౌష్య మాసపు తుషారాలు, ఆధ్యాత్మికపు శోభలు
గడప గడపకు రంగవల్లుల అలంకారాలు.
భోగి మంటల వెచ్చదనాలు, కొత్త అల్లుళ్ళ ఆగమనాలు
చెరుకు ముక్కలు, రేగుపళ్ళతో తీసిన దృష్టిదోషాలు
భోగభాగ్యాలను ప్రసాదించే హరిదాసులు
బుడబుక్కల వారి నోట భవిష్యత్ పలుకులు.
మకర సంక్రమణపు సూర్యోదయ జపాలు
పితృదేవతల కొలువులు, పిండివంటలు
గంగిరెద్దుల విన్యాసాలు, బాలబాలుర కేరింతలు
బొమ్మల కొలువులు, ముత్తైదువల పేరంటాలు.
కనుమనాటి కళకళలు, ప్రకృతికి పూజలు
పశుపక్ష్యాదులకు కృతజ్ఞతాపూర్వక వందనాలు
ఇంటిచూర్లకు కట్టేరు ధాన్యపు కంకులు
పొట్టనిండా మినపసున్నెలు, గారెలు
ఇవే నా ఇంటి సంక్రాంతికి చిహ్నాలు
ప్రతీఇంటా పొంగిపొర్లాలి భోగభాగ్యాల పొంగళ్ళు
–శ్రీ పేరి

తొలి సంక్రాంతి

ప్రతుకు చీకట్లను తరిమేందుకై
ఉత్తరాయణంలోని తొలికిరణంతో
ఉదయించిన తొలి పొద్దున్న ...!
మబ్బులోని జాబిల్లి పోనీ జామున
నేలమ్మకు అందాలు దిద్దుటకై
ముస్తాబైన ఆడపడుచులయ్యాల..!
అమ్మను ముద్దాడినట్లు
వాకిళ్లను ప్రేమగా అల్లుకున్నట్టు
ఆవు పేడతో అంతా పరచగా..!
ఆకశాన ఇంద్రధనస్సుల
రంగుల వర్ణాల్ని
ముగ్గులతో నింపగా ముంగిట్లో
బోబ్బెమ్మలను పసుపు కుంకుమాలతో
పచ్చ తోరణాల ముంగిట్లో నింపగా..!
గుమగుమ పిండి వంటకాతో
బంధుత్వాల బంధాలకే ఏకమై
పసిపిల్లలకై భోగి పూల పండ్ల ప్రతీక
ఈ మకరం !
గంగిరెద్దులతో
హరిదాసుల గానాలతో
కొత్త కాంతుల్ని నింపే
మూడు రోజుల ముచ్చటైన
మన సంక్రాంతి పండగ!
–మదూరి.అనితా చరణ్

సంక్రాంతి

సంక్రాంతి వేళ
సంబరాల హేల.
ఊరుఊరంతాను ముస్తాబు
పట్నం వారికి పిలుపుల జాబు.
చలి పొద్దుపొడుపులో
నులివెచ్చని భోగిమంటలు.
భోగిపాటల అలరింతలు
ముంగిళ్లలో అందాల హరివిల్లులు.
గొబ్బెమ్మలతో అమరిన రంగవల్లికలు
మామిడాకుల తోరణాలు.
కొత్తబట్టల సోయగాలు
పిండివంటల ఘుమఘుమలు.
కొత్తపొంగలి మధురిమలు
గాలిపటాల రెపరెపలు .
చెరుకు గడలలో తీపిదనాలు
కొత్త అల్లుళ్లకు అతిథిమర్యాదలు.
హరిదాసు కీర్తనలు
గంగిరెద్దుల ఆటలు .
పిట్టలదొర కోతలు
పగటివేషగాళ్ళ పాటలు
జంగమదొరలు,కాటికాపరులు
కాడెద్దుల పందాలు,కోడి పందాలు
కోలాటమాటలతో వీధి కూడళ్ళు
ఎడ్లపందాలు,కోడి పందాలు.
పండంటి పాపాయిలకు
భోగి పళ్ళ దీవెనలు.
బొమ్మలతో కొలువులు
భోగభాగ్యాల నెలవులు.
పశువులకు పూజలు
పనివారికి బట్టలూ,ధాన్యాలు
అందాల సంక్రాంతి
ఆనందాలు పంచుతుంది
తన వారినందరినీ
తట్టి చూసుకుంటుంది.
సాహితీ కాన్వాసుపై సంక్రాంతి
సరికొత్త కవితల
పూలదండలల్లుతుంది.
–విశ్వైక

మా ఇంటి సంక్రాంతి.

సంక్రాంతి పండగ అంటే సందడి సంతోషం వచ్చినట్టు
సంక్రాంతి వస్తే సంపద సంబరం వెంట తెచ్చినట్టు
ధనుర్మాసం వచ్చేసింది ధరణి మొత్తం
ధవళ పద్దపు ముగ్గులతో ధగధగమెరిసిపోతున్నది .
రమణులందరూ కలిసి రంగవల్లులు తీర్చిదిద్దారు
ముంగిట వాకిళ్ళలో .
ముత్యాల ముగ్గులు, ముగ్గుల్లో గొబ్బిళ్ళు పేర్చి మురిసిపోతున్నారు.
రంగనాథుని కోవెలలో నెల గంట మోగించి,
పాశురాలు పఠించి నేతి నైవేద్యాలు పంచిపెట్టిరి.
ముద్దు గుమ్మలంతా కూడి ముద్దబంతి పూలతో
చెలులంతా చేరి చామంతి మాలలతో .
తరుణులంతా కలిసి తంగేడు పూలతో తోరణాలు కట్టినారు.
ఇంటినిండా ఇంపైన పాడిపంటలతో నిండిపోయే ధాన్యాగారాలు.
ఇంతులందరూ చేరి ముచ్చట్లతో మురిపెంగా వండిరి పిండివంటలు
హరిదాసులొచ్చారు హరికీర్తనలు చేసారు .
జంగమదేవరులొచ్చిరి గంగిరెద్దులాడించిరి .
గంతులేసిరి చిన్నారులు గలగలా నవ్వుతూ.
పల్లెలోనికుర్రవారూ సన్నకారు కలిసి
కోడి పందేలాడిరి .
కోలాటం తో కోలాహలం చేసిరి.
కూతుళ్లు అల్లుళ్లతో అలరించే అత్తగారిళ్లు .
పిల్లా పాపలతో పులకరించే పుట్టినిళ్లు.
భోగి మంటల వెలుగులో బాల భానుడు అరుణ వర్ణం లో అలరించే .
చిట్టి తల్లులు బొమ్మల కొలువు పేర్చి పేరంటం చేసిరి
బావ మరదళ్ల లుకలుకలు ,బావమరుదుల పకపకలు ,
మామగారి మర్యాదలు ,అత్తగారి ఆప్యాయతలు
కొసరి కొసరి వడ్డించే కోడళ్ళు ,
ఆనందంలో తేలియాడే అల్లుళ్ళు ,
పిల్లలు పెద్దలు పతంగులెగరేసి పండుగకు కళ తెచ్చిరి .
కనుమ నాడు కాకైనా కదలదంటూ కట్టిపడేసే పెద్దవారు ,
కండువాతో కన్నీళ్లు దాచుకుని సాగనంపే కన్నవారు ,
కదలలేక వదలలేక పయనమయ్యే పసివారు.
ఇదే నాకు తెలిసిన ప్రతి యింటి "సంక్రాంతి" సందళ్ళు
ఇన్నేళ్లయినా ఎన్నేళ్ళైనా మరువలేని
మాయింటి "సంక్రాంతి సంబరాలు.
–రాజ్యశ్రీ పొత్తూరి.

మన సంక్రాతి.

అయ్యవారికి దండం పెడుతూ,
అమ్మవారికి దండం పెడుతూ,
రంగుల బొంతలు కప్పుకున్న గంగిరెద్దులు చేసే విన్యాసాలు,
వనితల వేళ్ళ కౌసలనుండి జాలువారే
రంగు రంగుల రంగవల్లులు,
కాలిగజ్జెలు ఘల్లుమనగా, చిందులు వేస్తూ,
చేతిలోని చిడతలతో తాళం వేస్తూ,
గొంతెత్తి పాడుతున్న హరిదాసుల హరికీర్తనలు,
కొత్త అల్లుళ్లను ఆటపట్టిస్తున్న కొంటెకోణంగి మరదళ్ళు.
మత్తు వదలని సూరీడుని వెచ్చగా ఆహ్వానిస్తున్న భోగిమంటలు,
గడుగ్గాయి పిల్లల చేతుల నుండి,
గాలిలోకి ఎగురుతున్న గాలిపటాలు,
తిరుపతి శ్రీ వెంకటేశ్వరునికి తిరుప్పావైతో మేలుకొలుపులు,
తిలకించినంతనే, మది పులకించే 'గోదా,
రంగనాథుల కల్యాణ వేడుకలు,
గణ గణ గంటలతో, గుడులలోన హారతులు,
పండిన ధాన్యపు పంటలు ఇళ్లకు చేరుస్తున్న ఎడ్లబండులు,
సూర్యభగవానునికి సమర్పించే పొంగలి నైవేద్యాలు,
ఏలవచ్చెనమ్మ కృష్ణుడంటూ గోపికాగీతాలతో గోబ్బిళ్ల పేరంటాలు,
సఖినాలు, అరిసెలతో తెలంగాణ పిండివంటలు,
కోట్ల రూపాయల పణములతో, కోడిపందెములు,
సంతరించుకున్న ఆనందపువెల్లువలు,
ఈ సంక్రాంతి సంబరాలు, అభ్యుదయం,
ఆరోగ్యం, ఆనందం, ఆచారం కలగలిసిన సంప్రదాయం,
కలసి మెలసి సాగిపోయే సంక్రమించిన క్రాంతి పథం.
–అడవి. అన్నపూర్ణ.

పల్లె సంక్రాంతి సోయగం

సంక్రాంతి శోభాయమానం సుసంపన్నం సుందరం
పుట్టి పెరిగి అందాలు తెచ్చింది సంక్రాంతి పల్లెలోన
పల్లెటూరి లోగిళ్ళు నిండిన పూల రంగుల దోసిళ్ళు.

ఉషోదయ వేళలో ఆకశాన పక్షుల కోలాహలం
నిండిన చెరువుల మునిగి తేలుతున్న బాతుల ఆటలు
అందాలు ఒలకబోయు తామర కాంతుల తలుకులు.

ఇటు చూడు, అటు చూడు ఎటు చూచినా
రంగు రంగవల్లుల నడుమ చిక్కి తిష్టవేసి
ముచ్చట గొలుపు గొబ్బెమ్మల ముంగిళ్ళు.

సన్నాయి మేళాల కూడిన గంగిరెద్దులు
పోటీలు పడిన హరిదాసుల హరిలో రంగ హరి
నినాదాలు మిన్నంటే పల్లె వీధి వీధుల ఎల్లెడలా.

ఉదయపు వేళ కోయిలమ్మ ల కూకూ ధ్వనులు
మంచు నిండిన పూల చెట్ల వాసనల ఘుమఘుమలు
కదలనీక మెదలినిక కట్టి పడవేసే పిల్ల వాయువులు

అమ్మలక్కలు చెట్ల కింద చేరి వండిన అరిసెలు
జంతికల కమ్మని వాసనలు రుచుల సమ్మేళనం
ఆరగింపు వచ్చిన అల్లుళ్లు చుట్టాల సందడి.

గృహ సముదాయాల నడమ వారి కోలాహలం
ఏమని చెప్పాలి సంక్రాంతి శోభ చూడముచ్చటేగాని
వర్ణించ అంతుచిక్కని అవధులు దాటి అందం.

పట్టణ వాసులారా సంక్రాంతి శోభ కోడి పందాలు
చూడ కదలండి మరువలేని పల్లె వింతవింతలు
ఆకాశం ఎత్తు మంటలెగయు భోగిమంటల వీధుల.

బొమ్మల కొలువులు అలరారు ఇంటి ఇంట సంబరాలు
పేరంటాండ్ర సందడుల సహజ సోయగం
చూడగ కనగ కనువిందు చెప్ప తరమే.

ఇంట నిండిన ధాన్యపు రాశులు పురులు
ఇనుమడించు ముఖ సంతోషాలు
వెలుగులు నింపే సంక్రాంతి సిరులు

పెరట కాసినా జామ దానిమ్మ
పండ్ల రుచులు నిండిన చేమంతి
పూబంతి మేలు బంతుల అందం
చూడ తరమే సంక్రాంతి సోయగం
నిండిన మనముల ఉల్లస హ్వాయలు
–చల్లా సత్యనారాయణ
9346773494

సంక్రాంతి అంటే కొత్త క్రాంతి

అంబరాన్నంటే సంతోషాల సంబరం
సందడితో స్వాగతించే ఆనందం.
పండగంటే పసందైన విందు
పట్నం నుండి వచ్చిన బిడ్డలతో పల్లెలు కనువిందు .
పడతుల పట్టుచీరల రెపరెపలు
సంప్రదాయ దుస్తుల మిలమిలలు .
గాబు నిండా కొలువైన కొత్త ధాన్యం
పుడమి తల్లికి సమర్పించిన బోనం .
దివినుండి దిగిన హరివిల్లులు
ముంగిట్లో వెలసిన రంగవల్లులు.
ముగ్గుల్లో కొలువైన గొబ్బెమ్మలు
గొబ్బెమ్మలను పూజించే కన్నెపిల్లలు .
ముత్యాల ముగ్గులతో ముస్తాబైన గడపలు
పచ్చని మామిడి తోరణాలతో స్వాగతించే గుమ్మాలు
హరిలో రంగ హరి అంటూ వచ్చె హరిదాసులు
సొన్నాయిలతో పలకరించే గంగిరెద్దులు
పిండివంటల ఘుమఘుమలు
పిల్లాపాపల కేరింతల కళకళలు
చిరుచీకట్లలో గుడిలోహారతులిచ్చే అతివలు
ధనుర్మాసం తిరుప్పావై ప్రవచనాలు
పసందైన కోడి పందాలు
భోగి పళ్ళు, బొమ్మల కొలువులు
ముత్తయిదువుల పసుపు కుంకుమ కలబోతలు
కొత్తనోముల, కన్నెపిల్లల వాయినాలు
ఆడబిడ్డలు, అల్లుళ్ళతో నిండుకునే లోగిళ్ళు
అనురాగ అనుబంధాల పొదరిల్లు.
పండగంటే ఒక ఒడవని ముచ్చట
అందరు కలిసి ఆడుకునే అచ్చట.
సంక్రాంతి అంటే పెనవేసుకున్న పెన్నిధి
తరగని తడియారని బంధాల సన్నిధి!
–నామని సుజనాదేవి

సంబరాల క్రాంతి

సూర్యుడి మకర సంక్రమణ ఆగమనంతో
సంక్రాంతి శోభల శుభారంభంతో
అంబరాన పతంగుల విహారంతో
అవనిపై కోళ్ల పందేల సమారంభంతో
ముంగిళ్లలో తీరొక్క రంగుల హారాలతో
గుమ్మాలకు మామిళ్ల తోరణాల శోభాయమానంతో
హరిదాసుల మధుర సంకీర్తనల ఆలాపనతో
దూడూ బసవన్నల సుందర నాట్యాలతో
పచ్చని పల్లె సీమల సోయగాలతో
కొత్త అల్లుళ్ళ సరదా సరదా వినోదాలతో
హేమంతపు హిమాల ఘనీభవంతో
సమస్త తిమిరాలను హరించే భోగి మండలతో
నోరూరించే సమస్త వంటకాల ఘుమఘుమలతో
ముద్దబంతుల గొబ్బిళ్ళ మురిపాలతో
పాడిపంటల పరవళ్ల పరవశాలతో
అంబరాన్నంటే నవ్యకాంతులతో
హితవు,సన్నిహితుల చతురోక్తులతో
గుర్తుండి పోవును ప్రతీజ్ఞాపకం
నెమరు వేసుకోవాలి మరో సంక్రాంతి వరకై
సుఖశాంతుల సంక్రాంతి
అదే సొమబరాల సంక్రాంతి??
–పురం మంగ

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం

మూడు రోజుల ముచ్చటైన పండగ
సంబరాలకు కొదవే లేదు,
పౌష్య లక్ష్మికి పుష్పాభిషేకం
చేయాలని
బంతి,చామంతులతో సింగారించి
తెల్లవారక ముందే గుడిలో
మోగే గంటలు
ధనుర్మాస పూజలతో గోదా
దేవికి
అంగరంగ వైభోగాలు
దద్దోజన నైవేద్యాలు
శ్రీకృష్ణుడితో గోపికల సయ్యాటలు
అర్చనలతో ఆళ్వారు దేవాల యాలు,
నెల రోజులునుంచే సంక్రాంతి వేడుకలు,
వీధులన్నీముత్యాలముగ్గులతో
రంగవల్లులు తీర్చి దిద్దిన రమణులు,
ముగ్గుల్లోగొబ్బిళ్ళుబంతిపూల తోరణాలు
బొమ్మలకొలువులుపేరంటాళ్ళు
భోగి మంటలు,తలంటు స్నానాలు
పసిపిల్లలు భోగిపండ్ల పేరంటాళ్లు,
పడతి సౌభాగ్యానికి పసుపు
కుంకుమలు,
గంగిరెద్దులసన్నాయిమేళాలు మ్రోగిస్తూ
హరిదాసులభజనసంకీర్తనలతో
ఆనందంవెల్లివిరిసేఅనుబంధాల లోగిల్లు
అందరూఒకచోటచేరిఆత్మీయంగా
జరుపుకునే సంక్రాంతి ఓకొత్త కాంతి,
సంక్రాంతి లక్ష్మికి స్వాగతం"
–రాయవరపు సరస్వతి
9885656356

శ్రీ శుభముల సంక్రాంతి

సిరి శుభములిచ్చి తెలుగిళ్ల చిరము విరియ
పెద్ద పండగై ఇంటింట పెరిమి మురియ
పుష్య మాసపుటందాలు పుడమికిచ్చి
పాడిపంటల పండగై భవ్య రీతి.
వినగ వివిధ రాష్ట్రములందు వేరు పేర్ల
తోడ పిలుచుచు మురిసెడి తోరణాల
పిండి వంటల పండుగ పేర్మితోడ
తెలుగు లోగిళ్ల వచ్చె వెలుగులిచ్చి.
క్రాంతి కాంతు

గొప్ప గుణం

కథ

చిలుక వనం మడుగులోని ఒక పెద్ద చేపకు తాను ఇతర చేపల కంటే కొంచెం పెద్దగా ఉన్నానని గర్వం.ఒకసారి ఆ మడుగుకు ఒక కొంగ చేపల కొరకై వచ్చింది. ఆ కొంగకు ఒక చిన్న చేప దొరికింది. అప్పుడు ఆ పెద్ద చేప ఆ చిన్న చేప దొరికినందుకు ఎంతో సంతోషించి" ఇది నాతో పాటు పైకి వచ్చింది. నేను తప్పించుకున్నాను. ఇది ఆ కొంగకు దొరికిపోయింది. ఇది నా ముందు డాబుకు పోయింది "అని అంది.

అప్పుడు దాని పిల్లలు "అమ్మా! ఆ చిన్న చేప నీకు సాయం చేద్దామని పైకి వచ్చింది. నిన్ను ఆ కొంగ పట్టుకొంటుందేమోనని అది భావించింది. వెంటనే అది నీ కన్నా ముందే ఆ కొంగకు దొరికిపోయింది. అది మాకు ఈ సంగతి ముందే చెప్పింది. అది నీ ప్రాణం కాపాడుటకు వస్తే నీవేమో అది కొంగకు దొరికినందుకు సంతోషిస్తున్నావు. ఇప్పుడు దాన్ని కాపాడవలసిన బాధ్యత కూడా మనపై ఉంది" అని అన్నాయి.

ఆ మాటలను విన్న పెద్ద చేప "అయ్యో! ఆ సంగతి నాకు ఎందుకు చెప్పలేదు. నాకు ఈ విషయం తెలియదు. ఇప్పుడే వెళ్లి దానిని కాపాడుతాను "అని అది నీటి పైకి వచ్చింది. అప్పుడు ఆ పెద్ద చేపను చూసిన ఆ కొంగ "ఈ చిన్న చేప కన్నా ఆపెద్ద చేపనే పట్టుకోవడం మంచిది" అని అనుకొని దానిని వదలిపెట్టి ఆ పెద్ద చేపను పట్టుకుంది.

అది ఆ చిన్న చేప గమనించి "అయ్యో! దీనిని కాపాడాలని నేను పైకి వస్తే ఇది మళ్లీ పైకి వచ్చి ఆ కొంగకు దొరికి పోయింది. సరే! దీన్ని ఎలాగైనా కాపాడాలి" అని తన మిత్రులైన కప్పుల వద్దకు వెళ్లి ఆ పెద్ద చేపను కాపాడమని చెప్పింది. అప్పుడు ఆ కప్పలు ఒడ్డుకు చేరి ఆ కొంగ రెండు కాళ్ళను అది ఎగిరి పోకుండా గట్టిగా పట్టుకున్నాయి ఆ కొంగ తన ముక్కుతో వాటిని పొడవ బోయింది. కానీ ఆ కప్పలు తప్పించుకున్నాయి. ఈ హడావుడిలో ఆ పెద్ద చేప ఆ కొంగ ముక్కు నుండి జారి నీటిలోనికి ప్రవేశించి తప్పించుకుంది. ఆ కప్పలు కూడా చిన్నగా గాయపడి ఎలాగో తప్పించుకొని నీటిలోకి చేరాయి. వెంటనే ఆ కొంగ "అయ్యో!నా అత్యాశనే నా కొంప ముంచింది"అని భావించి చేసేదిలేక అక్కడి నుండిఎగిరిపోయింది.

ఆ కొంగ నుండి సురక్షితంగా వచ్చిన తమ తల్లిని చూసి ఆ పెద్ద చేప యొక్క పిల్లలు" అమ్మా! ఈ కప్పలు,ఈ చిన్న చేప ఎంతో మంచివి. అవి తమ ప్రాణానికి తెగించి ఆ కొంగ నుండి నిన్ను కాపాడాయి. నీవు ఇకనైనా పరోపకారం చెయ్యి. నిన్ను కాపాడిన చిన్న చేపకు,కప్పలకు మనం ఎంతో ఋణపడి ఉన్నాం" అని అన్నాయి. అది విన్న పెద్ద చేప "నా గర్వం తొలగింది. ఇకనుంచి మనమంతా ఒకటే! ఎవరికి ఏ ఆపద వచ్చినా మనం ఐకమత్యం తో కలసి పోరాటం చేద్దాం. కప్పలతో పాటు ఈ చేపలన్నింటినీ నేను ఇకముందు సాయం చేస్తాను " అని అంది. అందుకు ఆ చేప పిల్లలు ఎంతో సంతోషించాయి.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

రాసే ఆసక్తి కలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్‌లో చేరి అక్కడ నియమాలు తెలుసుకుని గ్రూప్‌లో రాయండి.రోజూ అక్కడ వందలాదిగా వచ్చేవాటి నుంచి ప్రతివారం ఎన్నికయిన 25 సప్తపదులు "నేటినిజం"లో ప్రచురితం కాగలవు.

సప్తపదులు

(సప్తపదులు వాట్సప్ గ్రూప్ నుండి ఈ వారానికి ఎంపికయినవి)

సప్తపది సృజనకర్త:సుధామ నిర్వహణ :విహారి,శాంతిమూర్తి

జీవిత సత్యాల ఆవిష్కరణం -సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం

ఆసక్తికలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో చేరి రాయవచ్చు.

ఏదుపదాలు
సూక్తినదాలు
తాత్వికత వాస్తవికత కురిపించు
సప్తపది జలదాలు. **-పట్నాల ఈశ్వరరావు,** విజయనగరం

గతం,
హితం,
వేదికచూస్తే విజ్ఞానానికి,అభ్యుదయానికి,
అనుభవాలే సతతం
-డాక్టర్ వైవీ సుబ్రహ్మణ్యం, హైదరాబాద్.)

చేతనం
కేతనం
నూతనసంవత్సరం ధర్మపరిరక్షణకు
కంకణం కట్టుకోవాలి ప్రతినికేతనం!
-గోగినేని రత్నాకరరావు .తెనాలి)

ప్రకృతి
వికృతి
విషయమేదైనా కవికి పేరుతెచ్చేది మాత్రం సుకృతి.
-సదాశివుని లక్ష్మణరావు.విశాఖపట్నం

వస్త్రం
అస్త్రం
ఉత్తమ నడవడికై రూపొందించిరి
సాంప్రదాయాల శస్త్రం.
-మాదారపు వాణిశ్రీ, హన్మకొండ

ప్రయత్నం
విఫలయత్నం
రెండింటి పునరావృత ఫలితమే
విజయమనే అనర్ఘరత్నం!
-మామిడాల శైలజ, వరంగల్.

పవనం
దవనం
తెమ్మెరలు సుగంధాలు నింప ప్రాంగణం ఆనందవనం
-గంగరాజు పద్మజ,హైదరాబాద్

ప్పమాంజలి
పుష్పాంజలి
అందుకున్నామె విధివంచితగా
నేడు అర్పిస్తోంది బాష్పాంజలి
-శేష శైలజ (శైలి), విశాఖపట్నం

దేహశుద్ధి
పూజశుద్ధి
శుచితో దైవారాధన సరిపోదు
కావాలింకా చిత్తశుద్ధి
-పీకేదుర్గాప్రసాద్, విశాఖపట్నం

రాకడలు
పోకడలు
రోజూ తప్పదు కాలం గాలం ఎత్తుగడలు
-డా .రమణ యశస్వి, గుంటూరు.

నిగమము
ఆగమము
వేదశాస్త్రాలు నేర్చుకొనుటకు గురువును
చేరుట నియమము.
-కామేశ్వరి వాడ్రేవు, హైదరాబాదు

జగమునగము
విమానంతో పోటీ పడుతూ ఎగురుతోంది ఖగము
-ఐ. చెన్నకేశవులు, కర్నూలు

లంక
కింక
రావణ వధతో తీరెను వేలుపుల శంక
-భాగవతుల కృష్ణారావు, సికింద్రాబాద్

హరితం
భరితం
ఆదర్శం, పూజితం, రమ్యం,
రసమయం రామచరితం !
-జి.వి.సూర్యనారాయణ, హైదరాబాదు.

భోగి
జోగి
వీరిని అనుకరిస్తే నువ్వవుతావు తప్పక మానసికరోగి
-యు. రామకృష్ణ, గన్నవరం

మరకలు
తరకలు
ఓర్పు వహించి తుడిచేవారిని అనవద్దు గడ్డిపరకలు
-గంగరాజు పద్మజ,హైదరాబాద్

కొత్తపుంతలు
పాతవింతలు
పెట్టుకున్న లక్ష్యాలు వాయిదాలతో
మారని తంతులు
-నేమాన సుభాష్ చంద్ర బోస్, విశాఖపట్నం

అందం
ఆనందం
సమంగా పండిన మనిషి జీవితం పరమానందం
-చౌదూరి నరసింహా రావు, హైదరాబాద్

ఎడబాటు
సర్దుబాటు
మనసు శృతితప్పిన సుడిగుండమైతే
అలలా తిరుగుబాటు.
-వై.పద్మ, కొత్తగూడెం,

వందనాలు
చందనాలు
ఘనమైన సత్కారాలకు ఉబ్బితబ్బిబ్బైన
అతిథుల తందనాలు
-కె.వరలక్ష్మీదేవి, కర్నూలు

తెరిచేదెలా
మూసేదెలా
మనసులోని భావాలు గోదావరిలా
పెల్లుబుకుతున్నాయి ఆపేదెలా
-రామకూరు లక్ష్మి మణి, హైదరాబాదు

తరం
కరం
మార్గదర్శకమై దారి చూపిన
అదొక వరం
-అర్చన కోపూరు, హైదరాబాద్

సొత్తు
మత్తు
రెండూ ఎక్కువయితే ఎవరైనా అవుతారు చిత్తు.
-దోసపాటి వేంకటరామచంద్రరావు విజయనగరం

తమకం
గమకం
సరసశృంగార రసధునిలో
ఓలలాడాలంటే ఉండాలి యమకం!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య. మహబూబ్ నగర్

నాదీ
నీదీ
మనిషికి చివరకు మిగిలేది లేదు ఏదీ.
-కుసుమంచి నాగమణి, మెంటాడ.

సహాయం

కథ

అనగనగా నాగపురి అనే ఊర్లో చిన్న కుటుంబం ఉండేది. కిషన్, చాంది అనే దంపతులు ఉండేవారు. వారికి మధు, సింధు అనే కుమారుడు, కుమార్తె ఉండేవారు. ఇద్దరు చదువుకుంటూ ఉండేవారు. అప్పుడప్పుడు పొలం పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేసేవారు. ఒక రోజు ఇద్దరూ పొలం వద్దకు వెళ్లారు. పొలం పనులు చేస్తూ చేస్తూ, పక్క పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ఒక చెట్టు క్రింద తెలిసిన పక్క పొలం ముసలి అవ్వ కండ్లు తిరిగి పడిపోయింది. అక్కడ ఎవ్వరూ లేరు.

ఇద్దరూ కూడా ముసలి అవ్వను చూసి, పరుగున వెళ్లి లేపి కూర్చోబెట్టి, నీళ్ళు తాగిపించారు. ముసలి అవ్వ మెల్లగా కండ్లు తెరిచింది. అవ్వ ఏమైందని అడిగారు. నేను తెచ్చుకున్న సద్ది ఆకలితో ఉన్న కుక్కకు పెట్టాను. నేను తినకపోవడం మూలంగా పడిపోయానేమో అని అన్నది. ఇద్దరు కూడా చాలా బాధపడ్డారు. తాము తెచ్చుకున్న సద్ది ముసలి అవ్వకు తినిపించి, ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటికి వెళ్లాక ముసలివ్వ వారికి వంట చేసి కడుపునిండా భోజనం పెట్టి వారింటికి పంపించింది.

నీతి: మనము ఎదుటివారికి సహాయం చేస్తే, ఆ సహాయం జీవితాంతం గుర్తుంటుంది.

-పూజా
ఎనిమిదవ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్ హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా
9311244843

బుద్ధ పర్కలు

అయిటి పూని
చినుకు పడిందా!
అప్పుడు సూడు
మన్ను కమ్మని వాసన

-అన్నవరం దేవేందర్
9440763479

సామాజికాంశాలతో "భావదర్పణం.."!

పుస్తక సమీక్షలు

కొత్త కవుల కలాలకు పదును పెడుతూ.. సృజనకారుల మేధస్సుకు మరింత మెరుగుల దుతూ.. కవిత్వ రచనలో నూతనత్వానికి చోటు కల్పిస్తూ.. అంతర్జాల సాహితీ సమూహాల్లో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న, "దర్పణం" సాహిత్య వేదిక ఆధ్వర్యంలో.. ప్రముఖ కవి విమర్శ కులు డా॥ రాయారావు సూర్యప్రకాశ్‌రావు సంపాదకత్వంలో "భావ దర్ప ణం" కవితా సంకలనం వెలువడింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక ద్వారా ఆవిర్భవించిన 'దర్పణం' సమూహం అనతి కాలంలోనే వైవిధ్య భరితంగా కార్యక్రమాలను నిర్వహి స్తూ.. అందరి దృష్టినాకర్షించడం అభినందనీయం.. అవగాహన, ఆచరణ, రచన, సవరణ, పునఃసృజన, ప్రచురణ ప్రేరణ అనే క్రమంలో "దర్పణం" సాహిత్య వేదికను ముందుకు నడిపిస్తున్న, సంస్థ అధ్యక్షులు డా॥ రాయారావు సూర్యప్రకాశ్ రావు గారు స్వయంగా రచనా జలధిలో ఓలలాడుతూ.. తోటి వారిని చిక్కని కవిత్వం రాసేలా చక్కని ప్రయత్నం చేయడం ప్రశంసనీయం. డా॥ నాళేశ్వరంగారు పేర్కొన్నట్లు.. కవితా నదిలో అనునిత్యం స్నానమాచరిస్తే.. ఏదో ఒకనాడు.. ఆ జీవ జలమే కవన జలమై మనోభూమి సస్యశ్యామలం చేయగలదు. ఈ దిశలో "దర్పణం" సభ్యులు వేస్తున్న అడుగులు ఎప్పుడో ఒకప్పుడు తప్పక కవిత్వ సృజనలో ఉన్నత శిఖరాలు అధిరోహించ గలవన్న విశ్వాసం ఉంది. డా॥ రాయారావు సూర్య ప్రకాశ్‌రావు సంపాదకత్వంలో "భావ దర్పణం" పేరుతో ఈ కవితా సంకలనాన్ని వెలువరించి కొత్త, పాత కవుల రచనలకు చోటు కల్పించారు. నూతనత్వమే పరమావధిగా కొనసాగు తున్న "దర్పణం" సమూహ సభ్యులు సృజించిన కవితల్ని ఏర్చి కూర్చి ఈ సంకలనానికి జీవం పోశారు. సామాజికాంశాల సమాహారంగా రూపుదిద్దుకున్న ఈ సంకలనంలోని కవితల్లో ఆయా కవుల ఆలోచనలను అక్షరాల్లో చూస్తాం. వస్తు ఎంపికలో వైవిధ్యం ఉంది. అభివ్యక్తిలో కొత్తదనానికి ప్రయత్నించే లక్షణమూ ఉంది. శిల్పం విషయంలో మరింత శ్రద్ధ చూపాల్సి ఉంది. చతురతతో కవిత్వాన్ని తీర్చిదిద్దాల్సి ఉంది. వస్తు విశ్లేషణలో ఇంకా పరిణతి సాధించా ల్సి ఉంది.

'దర్పణం' ద్వారా పైన పేర్కొన బడిన అంశాల్లో చక్కని శిక్షణనిస్తు న్నారు. ఏకాంశ కవితల్ని 'నేటినిజం' పత్రిక ద్వారా ప్రతివారం అందరికీ అందజేయడం ఆనందదాయకం.

సమీక్షల ద్వారా కవిత్వ నైపుణ్య తను పెంపొందించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం. కవిత్వాన్ని కవిత్వంలా రాసేందుకు సమూహ నిర్వాహకులు తోటి సమూహ సభ్యుల పట్ల చూపుతున్న శ్రద్ధ అభినంద ంచదగింది. ఆహ్వానింపదగింది.

అన్నింటికి మించి 'దర్పణం' సాహిత్య వేదికలో సంస్థ అధ్యక్షులు డా॥ రాయారావు సూర్యప్రకాశ్‌రావు గూగుల్ షీటు గొలుసు కట్టు కవితా రూపానికి శ్రీకారం చుట్టడం వల్ల బృందకవితలు రాసేందుకు మార్గం ఏర్పడింది. గూషీగొ కవిత.. నవతరం బృంద కవిత అంటూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. దీన్ని పరిచయం చేస్తూ ఓ కవిత ద్వారా రాయారావు సూర్యప్రకాశ్‌రావు నవతరం బృందగీతం యొక్క ప్రాశస్త్యాన్ని తెలియజెప్పారు.

వ్యక్తి కవిత్వం పాతకాలం
జంట కవిత్వం తర్వాతి కాలం
బృంద కవిత్వం నేటి కాలం అంటూ పెన్నూ, పేపరూ, కొట్టివేతలు లేని కవితలకు తెరలేపారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలు ప్రకటించారు.

వీటిని పాటిస్తూ రాసిన ఒకటి రెండి బృంద కవితల్ని ఈ సంకలనంలో పొందుపరిచారు. గూషీగొ కవిత 'కవిత్వం' శీర్షికతో దర్పణం కవులు రాసిన బృంద కవితను చదివినప్పుడు.. అందరు కలిసి ఒక్కో పంక్తితో ఎంపిక చేసుకున్న వస్తువును సీక్వెన్స్ దెబ్బతినకుండా.. అంశం దారి తప్పకుండా ఎలా కవితామయం చేయవచ్చో మనం తెలుసుకుంటాం.

అలజడి మనసుకు
లేపనమద్దే వెన్నెలకిరణం
కవిత్వం
చేతన హేతువు
చెలిమికి సేతువు అని బృంద కవిత్వాన్ని కవులు ఎత్తుకోవడం బాగుంది.

మనసును కవ్వంచేసే/సుమధురభావం/అద్భుత దృశ్యమాలిక అంటూ అందరు కలిసి కొనసాగించిన తీరు కూడా బాగుంది.

కవిత్వం
నవనవోన్మేష లలిత భావనా ఝురి అనీ సమాజ పోకడలకు ద్రవించిన మనసులు/అక్షర బద్ధమైన భావావేశం అనీ.. మదిలో మెదిలే మధురభావన.. అలజడి ఎదపై కురిసే పన్నీటి వాన అని ముగించడం బాగుంది.

ప్రతులకు:
డా॥ఆర్. సూర్య ప్రకాశ్‌రావు,
ఎఫ్-2, ఓమ్ రెసిడెన్సీ
ఉమానగర్, మెడ్చల్-501 401.
సెల్: 9441046839

ఇక ఈ సంకలనంలో కొలుతు దీరిన 130 కవితల్ని పరిశీలిస్తే.. వస్తు వైవిధ్యంతో.. సామాజిక అంశాలతో రూపుదిద్దుకున్నవే అడుగడుగున దర్శనమిస్తాయి. 65 మంది కవులు, కవయిత్రులు ఒక్కొక్కరు రెండేసి కవితల్ని రాశారు. వీరిలో వర్ధమానులు, ప్రవర్ధమానులు ఉండటం విశేషం!

ఈ సంకలన సంపాదకులు డా॥ రాయారావు సూర్యప్రకాశ్‌రావుగారు రాసిన "గుండె ప్రయాణం" కవిత అందరినీ ఆకట్టుకునే విధంగా మలచబడింది. హైదరాబాద్‌లో ఇటీవల బ్రెయిన్‌డెడ్ అయిన రోగి నుండి మరో రోగికి గుండెను అమర్చేందుకు ఎల్.బి.నగర్‌లోని కామినేని హాస్పిటల్ నుండి జూబ్లీహిల్స్ లోని అపోలో హాస్పిటల్‌కు గుండెను మెట్రో రైలులో తరలించిన సంఘట నపై సూర్యప్రకాశ్‌రావుగారు అల్లిన కవిత బాగుంది.

గుండెలో గుండెలతో
గుండె ప్రయాణం
మెట్రోకు గుండె ఉండదని నిరూపిస్తూ
వైద్యుల గుండెల సున్నితత్వాన్ని చూపిస్తూ
నగర వీధుల గుండా గుండె ప్రయాణం

అంటూ గుండెను పంపిన తీరు తెన్నులను చక్కగా ఆవిష్కరించారు. అలాగే సూర్యప్రకాశ్‌రావు గారు రాసిన "వేయి కొమ్మల తరువు" ఆలోచనాత్మకంగా తీర్చిదిద్దబడింది.

డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మిరాసిన "సెల్లుపిట్ట" కవితలో సెల్లును వింతలు చూపిస్తున్న మాయలాడిగా అభివర్ణించారు. పిల్లల నుండి పండు ముసలి వరకు నేడు సెల్లుకు ఎలా అతుక్కు పోయి.. బానిసలయ్యారో చక్కగా తెలియజెప్పారు.

శ్రీలతా రమేష్ గోస్కుల రాసిన "రాత్రి" కవిత చక్కని భావుకతతో రూపుదిద్దుకుంది. ఈ కవితలో పూబాటలోని పూబాలల సొగసు రేకులను.. నీలి ఆకాశాన నీలి పరదాల మాటున మేలుకున్న నక్షత్ర నగరంతో జతచేరిన అందాల నెలవంకను, అలసిన మేను కొమ్మన తొడిగిన కొత్త చిగురులను, అందంగా దృశ్యమానం చేశారు.

"భూఘోష" శీర్షికతో కవి గుర్రాల వెంకటేశ్వర్లుగారు రాసిన కవిత ఆద్యంతం బాగుంది.

వంటరుచి తినేదాకా తెలియనట్టే పుస్తకం గొప్పదనం చదివేదాకా తెలియదనీ.. ప్రతి అధ్యాయం నూతన సంగ్రామమనీ, ప్రతి పుటా ఓ కొత్త పార్శ్వ బోధనకు మార్గం అంటూ 'పుస్తకం నా నేస్తం' కవిత ద్వారా కవయిత్రి పురం మంగగారు ఆవిష్కరించిన తీరు అభినందనీ యంగా ఉంది.

దేశరక్షణ ధ్యేయంగా, తలవంచని ధీరులకు, దేశభక్తి ఉన్న త్యాగధనులకు 'జై జవాన్' కవిత ద్వారా కవి జి. కొండల్‌రావుగారు వందనాలు సమర్పించారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనార్థలను 'కాలుష్య కారకం' కవిత ద్వారా వి. సంధ్యారాణిగారు తెలియజెప్పారు. కవయిత్రి యాచం మంజుల తగారు రాసిన "ప్రియనెచ్చెలి" కవితలో పదబంధ ప్రయోగం బాగుంది. ప్రకృతి సోయగాలను అందంగా అక్షరాల్లో బంధించారు. మట్టి విలువ తెలుసుకుని.. మహిలో మనీషిలా విరాజిల్లాలంటూ పి. విజయరాఖిగారు పిలుపునిస్తే.. కంటికి కానరాని కాలాన్ని 'కాలగ మనం' కవిత ద్వారా డా॥దేవులపల్లి పద్మజ వివరించారు. 'పేదరికం' పేరుతో గుండం మోహన్‌రెడ్డిగారు రాసిన కవిత మినీ వ్యాసంలా రూపుదిద్దుకుంది. మరింత కవిత్వాంశ వుంటే బాగుండేదనిపించినా.. ఆయన ఆలోచనలు అభినందనీయంగా ఉన్నాయి. ఏ రాకాసి పాదమో/ పాతా ళంలోకి తొక్కేసిని నైతిక విలువలను/ నేను వెతుక్కోవాలి/ నన్నిలాగే వెతుక్కోనీయండి అంటూ "ధరాన్ని జార విడుచుకున్న స్వప్నం" కవిత ద్వారా డా॥ వనపర్తి తిరుపతి అభ్యర్థించారు.

మంచీ చెడూ/ కాల చక్ర భ్రమణం/ మాయా సంభ్రమం/ మాయా సంభ్రమం/ మహా మనీషి" అయినా/ మట్టి పెంకైనా/ కాలానికి బందీ అంటూ ఎ.రాజ్యశ్రీగారు "ఆగనుగాక ఆగను" కవితను రాశారు. ప్రకృతి రహస్యాన్ని, సృష్టి వైచిత్రిని తెలియజేస్తూ మానుకొండ విజయలక్ష్మి గారు రాస్తే.. అన్నదాతల వెతలకు అద్దం పడుతూ రూపన గుడి శంకర్ గారు తమ కవితను తీర్చిదిద్దారు.

ప్రేమకు నిర్వచనమై.. ప్రేమ మూర్తులుగా భాసిల్లిన రాధాకృష్ణులను తలుచుకుంటూ.. సౌదరి మోహన్‌గౌడ్ గారు రాస్తే.. 'పరమాత్మవైపు పయనం" శీర్షికతో ఆచార్య సువర్ణ అలివేలుగారు రాసిన కవితలో.. అనుచిత అసంభవ ఆశలు నెరవేరక పోతే దైవ దూషణవద్దని హితవు పలికారు. మన జీవితాలను శాసిం చేది సంఖ్యలే.. అంటూ తేల్చి చెబుతూ పరిమిలో వెంకట సత్యమూర్తి రాస్తే.. అక్షరాల పచ్చని తోరణాలతో పదాల పందిరిలోకి వాసంత సమీరాలను వెదజల్లి స్వాగతం చెబుతారు అక్షరశిల్పి అంటూ నల్లగొండ రమేష్ తమ కవితను రూపుదిద్దారు.

కాలం నదిలో/ బతుకు పడవ పూలతేరు కావాలంటే/ కష్టాల దుప్పటిని/ ఆశల కిరణాలపై దులిపేయాలని సూచిస్తూ అద్దంకి తిరుమల వాణిశ్రీ రాస్తే.. అభినేత్రి మహా నటి సావిత్రి నటనకు నిండు రూపమంటూ స్వాతి బొలిశెట్టి తమ కవితను పొందుపరిచారు. నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతూ నక్క హరికృష్ణగారు ఈ దేశపు భవిష్యత్తు భావనలను ఆవిష్కరిస్తూ తమ కవితను తీర్చిదిద్దితే.. అబల కాదు. సబల. ఆదిశక్తికి ప్రతీక అంటూ మహిళ యొక్క ఔన్నత్యాన్ని చాటి చెబుతూ గుడికందుల ప్రకాశం తమ కవితను రాశారు. పరాజయం నుండి పాఠాలు నేర్చుకుందామంటూ పోలయ్య కూకట్లపల్లి పిలుపునిస్తే.. అక్షరం యొక్క గొప్పతనాన్ని తెలియజెబుతూ మోటూరి శాంత కుమారి అక్షర సత్యాలను తమ కవిత ద్వారా వివరించారు.

డా॥ భూంపల్లి కేశవరెడ్డి తమ కవిత ద్వారా ఆవకాయ రుచి చూపిస్తే.. ఎం.వి. ఉమాదేవిగారు స్వరమాధురీలయలతో మౌన రాగాలను ఛేదించే గళ గమకాల ఆలంబనతో మనోహర గీతాన్ని అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

తెలుగువారి గుండెల్లో పీఠం వేసుకున్న చిరంజీవి మన పీవీ జ్ఞానవారధి అం టూ నన్నపురాజు విజయశ్రీ రాస్తే.. నిర్మలత్వం, ఉగ్రత్వం, దాతృత్వంతో ప్రవహించే నది గురించి జె. నరసిం హారావు రాశారు. తన అక్షరమెప్పటికీ అధర్మానికి వ్యతిరేకం.. ధర్మానికి పట్టాభిషేకమంటూ త్రివిక్రమశర్మ 'అక్షర సైన్యం' కవితను రూపుదిద్దారు. తమ కవిత ద్వారా "ఫలితం కోసం సాధన చెయ్యి" అంటూ రామకృష్ణ చంద్రమౌళి కోరితే.. 'దినపత్రిక' గురించి డా॥ రమేశ్ నానవేయిన రాశారు.

కాటుక కళ్ల సోయగాల్లో మదిని దోచే భావాలెన్నో అంటూ 'నీలికళ్లు' కవితను మన్నె లలితగారు రాస్తే.. ముద్దు వెంకటలక్ష్మి వినీలాకాశంలో మేఘ సముదాయాలు స్వేచ్ఛగా ఆడుకునే దృశ్యాలను అందంగా చిత్రిస్తూ 'సవరస వాహినులు' కవితను రూపుదిద్దారు. 'స్పర్శరేఖ' కవితలో ముదిగొండ సంతోష్‌గారు పల్లె అందాలను ఆవిష్కరించారు. కవితే నా ఆరధ్య దైవమంటూ రుద్రక్షల మఠం ప్రభులింగశాస్త్రి తమ కవితను తీర్చి దిద్దారు. మనిషికి మనిషి అభయం కానప్పుడు ఎన్ని వేదాలు వల్లిస్తేనేం? పూట పూటకీ ఖురాన్లు చదివితేనేం.. లెక్కలేనన్ని సార్లు బైబిళ్లు పఠిస్తేనేం అంటూ కూతురు రాంరెడ్డి తమ కవితను రాశారు.

ఆడపిల్లకూ మనసుంటుందనీ.. సమానంగా పెంచుమని, సమానంగా చూడుమని హితవు పలుకుతూ ఉప్పల పద్మ రాస్తే.. మాడుగుల నారాయణ మూర్తిగారు ధీమా గల కవితలెల్ల దీప్తిని నింపున్ అంటూ తమ పద్యాల ద్వారా కవిత్వం యొక్క ప్రాశస్త్యాన్ని వివరించారు. జీవిత గమ్యాన్ని తెలిపే గురువుకు వందనం సమర్పిస్తూ గాండ్ల వీరమణి రాస్తే.. తెలుగు వెలుగు తిరునగరి.. సాహిత్యంబనెడిగిరి అంటూ ముత్యాల సరాల రూపకర్త వడిచర్ల సత్యం రాశారు.

"శ్రీదేవి" శీర్షికతో రాసిన కవితలో ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ ఏ పూవూ నీకు సరితూగ లేదని.. సౌందర్యం నీ ముందు మోకరిల్లిందని అభినేత్రి శ్రీదేవికి అక్షరాంజలి ఘటిం చారు.బాల్యం అమూల్యమైందని.. మాలిన్యం చేయవద్దంటూ నాగిరెడ్డి అరుజ్యోతిగారు సూచిస్తే.. ఉన్నోడికి డబ్బాకలి.. లేనోడికి తిండాకలి అంటూ ఆకలి కేకలను ఎల్. హేమలత తమ కవితలో ఆవిష్కరించారు. "మనో నేత్రం" శీర్షికతో ధర్మపురి వేంకటే శ్వర్లు రాసిన పద్యాల్లో కవిత్వం ఎలా ఉండాలో తెలియజెప్పారు. నేత్రదానం గొప్పదనాన్ని ఆవిష్కరిస్తూ ఇమ్మడి రాంబాబు రాస్తే.. "అభినవాక్షరం" కవితలో తుమ్మూరి రామ్మోహన్‌రావు అక్షరం ఒకప్పటి కట్టెపలకపై సుద్దగీత కాదనీ.. సాంకేతిక స్పర్శజాత.. సర్వకాల సార్వజనీన అనుసంధాత అని వ్యాఖ్యానించారు.ఇంకా ఈ సంకలనంలో డా॥ పాండాల మహేశ్వర్, కాశినేని గీతాదేవి, బండారు పుష్పలత, కాశినేని అంజన్‌బాబు, యర్రం సుమిత్ర, వి. సత్యనారాయణ, చెన్నా ప్రగడ కృష్ణవేణి, జి. రజిత, అన్నపూర్ణ యనమండ్ర, చక్రం విజయలక్ష్మి, డా॥వై.వి. రమణా రావు, బెల్దారి శ్రీధర్, జక్కని గంగా ధర్, గోపరాజు వెంకట సూర్యనా రాయణ, పరాంకుశం నారాయణ రావు, లక్ష్మారెడ్డి పసుల. జె.వి. కు మార్ చేపూరి, డా॥ కాసర్ల రంగా రావుగారలు రాసిన కవితలను పొందు పరిచి గ్రంథానికి శోభను కూర్చారు."దర్పణం" సాహిత్య వేదిక చేస్తున్న కృషిని అభినందిద్దాం. 'దర్పణం' ద్వారా కవిత్వ సృజనలో సభ్యులు మరిన్ని మెలకువలు తెలుసుకుని తమ కవితా పటిమను మరింత పెంచ కోవాలని కోరుకుందాం. ఆ దిశలో వారందరు అడుగులు వేస్తారని ఆశిద్దాం.

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

నవ్యత, నాణ్యత గల నవల

'ముగ్గురు అమ్మాయిల సవాల్" అన్న టైటిల్ చూడగానే ఇదేదో 'మంగమ్మ శపథం'. లేదూ రంగమ్మ ధైర్యం' లాంటి నవల అనుకుంటాము. అలాంటిదే కాని, అలాంటిది కాదు. వైష్ణవి, భార్గవి, సాహిత్య అనే ముగ్గురు అమ్మాయిలు కాలేజీ చదువు పూర్తి చేసుకుని, అయిదేళ్ళు ఒకరికొకరు సన్నిహితంగా మెలుగుతూ, క్రొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టబోయే అమ్మాయిలు.



ప్రతులకు:
తపస్వి మనోహరం పబ్లికేషన్స్,
కొండాపూర్,హైదరాబాద్.
సెల్: 7893467516

కాలేజీలో ఫేర్‌వెల్ పార్టీలో కాలేజీ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఎదుట ఈ ముగ్గురు అమ్మాయిలు తాము డాక్టరేట్ చేస్తామని తమ నిశ్చయం ప్రకటిస్తారు. ప్రిన్సిపాల్ వాళ్ళలో ఉన్న ఉత్సాహం గమనించి- ''గమ్యం చేరుకోవటానికి చాలా అవాంతరాలు వస్తాయి, అనుకోని కష్టాలువస్తాయి. మన చేతిలో ఏమీ ఉండదు" అని వాళ్ళకు బయట లోకాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేస్తుంది. పది సంవత్సరాలలో డాక్టరేట్ చేసి మళ్ళీ అదే వేదిక మీద కలుద్దాం అంటూ ఆ ముగ్గురు అమ్మాయిలు ప్రిన్సిపాల్‌తో 'చాలెంజ్' చేస్తారు.

తర్వాతి కాలంలో.. సాహిత్య ఎల్ఐసిలో ఉద్యోగం చేస్తుంది రవిచంద్ర అనే అబ్బాయిని పెళ్ళాడి గార్హస్థ్య జీవితంలోకి అడుగు పెడుతుంది.

వైష్ణవి డైరెక్టుగా పి.జిలో చేరుతుంది. విష్ణు అనే తమ బంధు వర్గంలోని అబ్బాయిని పెళ్ళాడి అటు చదువు ఇటు జీవితం- రెంటినీ కొనసాగిస్తూ డాక్టరేటుకు ప్రిపేర్ అవుతుంది.

భార్గవి స్వతః గాయని. శశిధర్ అన్న సహాధ్యాయి, ఆయనా గాయకుడే-తో పరిచయం పెళ్ళి అవుతుంది. మూడు పాటలు ఆరు పల్లవుల రీతిగా భార్గవి కూడా గృహిణి జీవితం మొదలెడుతుంది.

పెళ్ళి, ఉద్యోగం, పిల్లలు, సంసార బాధ్యతలు వీటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కుంటూ, ఆ అమ్మాయిలు ముగ్గురు, పదేళ్ళలో డాక్టరేట్‌లు సంపాదించి తిరిగి నిర్దేశించుకున్న కాలేజీలో పూర్

సాహిత్యవేత్తలు, రచయితలకు పూర్తి సహకారమందిస్తా

-తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఘనంగా సన్మానం చేస్తున్న ప్రకాష్‌రెడ్డి, గంటా మనోహర్ రెడ్డి, భాగయ్య, బడేసాబ్, దైవజ్ఞశర్మ, దొరవేటి, రాధకుసుమ. రాఘవేంద్రాచార్యులు

తెలంగాణ రాష్ట్రంలో కవులు, రచయితలు,సాహిత్యవేత్తలు ఎప్పుడు ఏ విధమైన అవసరమున్నా తనవద్దకొస్తే ప్రభుత్వ ఫరంగానైనా లేకపోతే స్వయంగా కూడా సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తానని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ హామీనిచ్చారు. రాజ్యాంగపదమైన శాసనసభాపతిగా మొత్తం 119 మంది శాసనసభ్యులు ఏకగ్రీవంగా తనను ఎంపికచేసి ఈ పదవిలో కూర్చోబెట్టినందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య సంస్థలు 'పెద్దయెత్తున తనకు మొట్టమొదటి సన్మానం చేసినందుకు ఆనందాన్ని వ్యక్తపరుస్తూ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, గోల్కొండ సాహితీ కళాసమితి, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలుగుభాష చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కవి సమ్మేళనం, సాహిత్య చర్చావేదికలతో పాటు ఇటీవల తెలంగాణ శాసనసభకు సభాధిపతిగా ఏకగ్రీవంగా నియమితులైన గడ్డం ప్రసాద్ కుమార్‌కు సాహిత్య సాంస్కృతిక సంస్థల సన్మానసభ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, సంస్థల అధిపతులు డా॥ అర్థచంద్ర ప్రకాష్‌రెడ్డి, ప్రొఫెసర్ భాగయ్య, బి. రాఘవేంద్రాచార్యులు, పి. బడేసాబ్, ప్రజారాజు తదితరులతో కలిసి జ్యోతి ప్రకాసనం చేసి కార్యక్రమాలను ప్రారంభించినాంతరం సాహిత్య సాంస్కృతిక సంస్థల అధిపతులు బడుగు బలహీన వర్గాల నుండి తెలంగాణ శాసనసభాపతిగా నియమితులైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి ఆయన ప్రతిభను కొనియాడారు.

సభకు ముందు కవిసమ్మేళనం, సభానంతరం పి. బడేసాబ్ సభాసమన్వయంలో డా॥ అర్థచంద్ర ప్రకాష్‌రెడ్డి, సభాధ్యక్షతన జరిగిన తెలుగు లిపిలో రాదగిన మార్పులు అనే అంశంపై మొదటి సమావేవం, గంట మనోహర రెడ్డి సమన్వయంలో బి.పి. నర్సింహులు గుప్త సభాధ్యక్షతన ద్వితీయ సమావేశం ఎంతో ఆసక్తికరంగా సాగి ఆహూతులను ఆకట్టుకొని ఆలోచింపజేశాయి.

నిర్మల్ చరిత్రకు నిదర్శనం ఈ పుస్తకం

-ఆవిష్కరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' అనే పుస్తకం నిర్మల్ జిల్లా చరిత్రకు నిదర్శనమని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు..

సభలో ప్రసంగిస్తున్న దామెర రాములు, డా॥ జుర్రు చెన్నయ్య

మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకం రచించిన కవులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పాల చక్రధరి, డా॥దామెర రాములు, తుమ్మల దేవ్‌రావ్, నేరేళ్ల హన్మంతు, అమరవేణి వెంకటరమణ, జాదవ్ పుండలిక్, కామారపు జగదీష్, పోలీస్ భీమేశ్, పత్తి శివప్రసాద్, వెంకట్, బొందిడి పురుషోత్తం, డా॥ జుర్రు చెన్నయ్య పాల్గొన్నారు.

బరువు తల

తల బరువు
బరువు తల.
నా తలను నేనే మోస్తున్నాను
తల చిన్న గుమ్మడికాయ అంతే కావచ్చు
కాని కాలమంతటి ఆలోచనలతో కైలసమంత బరువు
తల బరువు ఒకటే అయితే పెద్ద ఇబ్బంది లేదు.
తల ఒకటేనా
తలలో అవి ఏడ్పి
ఎదుటి వారినీ ఏడ్పించే కండ్లు !
కొలతగా కన్నుల్లో నూరు సంవత్సరాలకు సరిపడ్డ కన్నీళ్లు
సప్త సముద్రాలంత బరువు
అన్నింటినీ విని భరించే తిని నీబీబి చెవులు ఎంత బరువు.
లోకమంతటి దుర్గంధాలను సుగంధాలను
గాలులు గాలులుగా సహిస్తున్న టెక్కుల ముక్కు ఎంత బరువు.
అన్నింటికీ ఉన్నదే పెద్ద నోరు తెల్లారితే లేస్తే తినాల్సిందే
ఖర్మ ! పొట్టకు ఎంతో బరువో !.
జ్ఞానేంద్రియాలన్నీ మహా జ్ఞానులే
ఒకటి చెప్పింది ఇంకోటి వినదు
దేనికదే మేధావి చాణుక్య .
పర్థి బరువులు మోయడం కష్టమేం కాదు
తలలో ఇన్నిన్ని జ్ఞాన భారాలు
బరువు పై బరువు బరువు.
రాత్రి దిండు మీద తల పెట్టి నిద్రిస్తాను
విశ్రాంతిగా కొన్ని గంటలు తల బరువు పక్కకు !
ఐనా ఈ తల లేకుంటే నన్నెవరు గుర్తు పడతారు
తల పైనే అక్షంతలు
తలకే గజమాల
తలకే తిలకం
తలకే కిరిటం
తల ఉన్నవాడు లోకానికి
మేలు తల పెడితేనే
తల పేరుగా లోకంలో ఉండిపోతుంది
కీర్తిని సంపాదించే
తలను ఎంత బరువైనా మోయొచ్చులే
నా తల నాకు బరువేం కాదులే

- కందాళై రాఘవాచార్య
8790593638

లోతైన అధ్యయనంతో రచనలు చేయాలి

– ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్



సభలో ప్రసంగిస్తున్న రచయిత నిఖిలేశ్వర్, వేదికపై కందుకూరి శ్రీరాములు

రచయితలు నిరంతరం ప్రజల మధ్య ఉండి రచనలు చేయాలని ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్ అన్నారు. పబ్లిసిటీ పురస్కారాల కోసం రచనలు చేయకుండా లోతైన అధ్యయనంతో రచనలు చేయాల్సిన అవసరం యువ రచయితలపై ఉందన్నారు. సామాజిక మానవ అనుబంధాలు, పోరాట పటిమ, శాస్త్రీయమైన సామాజిక అవగాహన వ్యాసాలను విశ్లేషించే తపన తనను సాహిత్యపరంగా ముందుకు నడిపించాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో అంతర్‌వాణి శీర్షికన నిఖిలేశ్వర్ సాహిత్య జీవన ప్రయాణంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన జీవితంలోని సాహిత్య అనుభవాలను విప్లవ కవిగా, హేతువాదిగా మార్చిన సంఘటనలను వివరించారు. ప్రముఖ కవి రచయిత డా॥ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ రచయిత నిఖిలేశ్వర్‌ను తనతో పాటు ఎందరో సాహితీప్రియులు ఆదర్శంగా తీసుకుని రచనలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంతప్‌కుమార్ కొండపల్లి నిహారిణి, డా॥ నాళేశ్వరం శంకరం, శ్రీమతి సులోచన, కుడిక్యాల వంశీధర్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న "భారత్ వికసిత్ యాత్ర" పరిశీలన కోసం హర్యానా చేరుకున్న తెలంగాణ జర్నలిస్టుల బృందం యశోద, జి. కవిత, నంబిందర్, రవిచంద్ర, బాలరాజు, పి.ఐ.బి. వివేక్‌లకు వికసిత్ యాత్ర అమలు తీరును వివరిస్తున్న గురుగావ్ డిప్యూటీ కమిషనర్ హతేష్ కుమార్ మీనా, ఐ.ఏ.ఎస్

మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

ఏకాంశ కవిత్వం
నిర్వహణ:
-డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు
9441046839

మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1041వ రోజు 'లెక్కలు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'లెక్కలు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం.
-సంపాదకులు

గణిత జీవితం

లెక్కలతోనే ముడిపడింది జీవితం
కూడికలు తీసివేతల మిశ్రమం
గణితావిష్కరణలో మనదే తొలి తాంబూలం
ఆర్యభట్ట కనుగొన్న సున్నపెను సంచలనం
గణిత శాస్త్రానికి పోసింది పరిపూర్ణ ప్రాణం
శ్రీనివాసన్ రామానుజన్ గణిత సిద్ధాంతం
కలిగించింది విశ్వానికి విస్మయం
ఆయన జన్మదినం గణితదినోత్సవం.
ఆరు వేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తి
జాత్యంధుడైనా గణిత బ్రహ్మగా ఎదిగిన శక్తి
లక్ష్మీబాయి సంభీవరాయశర్మ ఆ లెక్కల యుక్తి.
అక్షరం ముక్క రానివాడికైనా అబ్బు గణితం
తెలుపేది జీవితంలో గణితానికున్న ప్రాధాన్యం
అయిన దగ్గరనుండి సూర్యోదయం
రాత్రి పూట చేరే వరకు శయనం.
లెక్కలు లేనిదే గడవదు క్షణం
జన జీవితంలో అంతర్భాగం
జీవితంలో ప్రతి అంశానికి ఒక లెక్కుంటుంది
దాని ప్రకారమే జీవితం గడిచిపోతుంటుంది.
-జె.వి.కుమార్ చేపూరి

అంతా లెక్కలేదు

లెక్కలు లెక్కలు
గాభరా ఎందుకు?
లెక్కలు రానిదెవ్వరికి?
చదువున్నా లేకున్నా
అందరూ లెక్కించగలరు
లెక్కలు చెయ్య గలరు
పామరులుకూడా
లెక్కించటంలో దిట్టలే.
లెక్కల మాస్టర్ని చూస్తే
విద్యార్థికి హడల్
అందకుండా పలాయనం.
గణితంలో
గణ గణ వాయించేస్తారు మరి
అర్థం కాని
విద్యార్థికి అయోమయమే
విపులంగా
వివరంగా
వివరించి బుర్రకెక్కించక పోతే
సబ్జెక్టు మీద చిర్రు బుర్రులే.
చిక్కు సమస్యల్ని విప్పే లెక్కలు
అనాది నుంచి
భారత దేశం సిద్ధ హస్తం
శ్రీనివాస రామానుజం
అందరికీ స్ఫూర్తి
గణితం ఒక శాస్త్రంగా
అభివృద్ధి చేసిన ఘనత
భారతీయులదే
అన్ని రంగాలకి ఆధారం గణితం
అన్ని శాస్త్రాలకి మూలం
అన్ని సైన్సులకి మహారాణి
పరిశోధనలకి గణితమే పునాది
ఆర్థికరంగానికికూడ
ఆయువు పట్టు
అపార సమాచారాన్ని విశ్లేషించి
వర్తమాన సమస్యల
పరిష్కారానికి గణితమే ఆధారం.
-మోటూరి శాంతకుమారి

జయహో

జీవన గమనం!
గణిత గణన మూల్యాంకనం!!
పరుగుల బతుకులను
ఆడించే గడియారం!
తిండికి బట్టకి
కొలతల గణితం!
పుట్టుక చావుకు
లెక్కల జాతకం
ఒక గణితం!
కాలం ఖగోళం
అంతా గణితం!
శ్రీ శ్రీనివాస రామానుజన్!
ఆయుర్దాయం 32 మాత్రమే!
సూత్రాలు 3900 పైనే!!
భారతీయ మేధా శిఖరం!
గణిత విజ్ఞాన కీర్తి పతాకం!!.
-జె.నరసింహారావు

తప్పితే అంతా గల్లంతే

ముడిపడని లెక్కలు
ముడివీడని లెక్కలు
చిక్కుముడి ప్రశ్నలు
చిక్కుల్లో పడేసే లెక్కలు.
జనాభా లెక్కలు
జనన మరణ లెక్కలు
ఇండ్ల లెక్కలు
పండ్లు బండ్ల లెక్కలు.
రాజకీయ లెక్కలు
అరాచకత్వపు లెక్కలు
బొంకు నేర్చిన లెక్కలు
కంగు తినిపించిన లెక్కలు.
సున్న చుట్టిన లెక్కలు
సున్నంబొట్ల లెక్కలు
మిస్సింగ్ బుక్ లెక్కలు
బొక్కబోర్ల ఫడే లెక్కలు!!.
పుట్టుక మొదలు అంతా
లెక్కలతోనే
సంసారం నడిచేది లెక్కతోనే
తప్పితే అంతా అయోమయం
అంతా గల్లంతు
సున్న కుడివైపు అనంతం
విలువ అపారం
ఎడమవైపు శూన్యం
కాదెప్పుడు అసత్యం!!.
- డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

అంకెల సమాహారం

మన భూమి పవిత్రం
పరమార్థికతతో సంపూర్ణం
సిరులతో జీవితం
ముడిపడి
నడయాడే స్థిరనివాసం
గణిత సౌరభాలు
అందించిన ఘనులు
ఆర్యభట్టు, వరాహమిహిరుడు
పాణిని,పింగళుడు,లీలావతి
రామానుజన్
ఎందరో శ్రేష్టులు
నడయాడిన
దివ్య ప్రాంగణం భారతావని
కాలగతి
రుతువులు
నెలలు
వగలూ రేయిల సంపకాలు
నెలల సున్నిత నడక
చెప్పకనే చెప్పే లెక్కల పట్టిక
ప్రతి అడుగు
ప్రగతికి సోపానం
జమ చేయక తప్పదు
ఇక్కడా లెక్కలే!
లెక్కే తెలియని మూర్ఖుడు కూడా
నేనున్నానే అంటాడు
యంత్రాంగం, మంత్రాంగం అన్నీ
ఆఖరికి
చావు పుట్టకలూ లెక్కలే
ఆద్వితీయం
లెక్కల్లో ఇమడనిదేది లేదు
ఈ జగతిన
కాలగతి సాగుతోంది
ఆ గణిత శాస్త్ర వైభవం !!!.
-కె.కె.తాయారు

మేధ(మెటిక్స్)

మన పూర్వుల మేధ అపూర్వం
ఖగోళాన్నికనుగొని లెక్కించారు దూరం
ప్రపంచంలోనే ముఖ్యమైన సున్న
గణితానికి మూలం
కనుగొన్నది భారతీయులం
నాటి నుండి నేటి వరకు సాధించామన్నో
గణిత అద్భుతాలు
గణితవధానాలు చేసాం
'ఆల్జీబ్రా 'గుండె గాభరా అన్నాం
శకుంతలా దేవి గారి మేధ
శాస్త్రానికే సవాల్
నేటికి కంప్యూటర్కు అందనిది
బాల మేధావులు చేస్తున్నారు
గణితవధానాలు
తెస్తున్నారు
బంగారు పతకాలు
'అబాకస్లో'
వేళ్ళతో చేస్తున్నారు లెక్కలు
ప్రతిదానికి కావాలి లెక్కలు
అవే తీరుస్తాయి చిక్కులు
అంకెలతో గారడీలు
గణితం లేనిదే కదలదు గడియ అయినా
అష్టదిక్పాలకులు, అష్టలక్ష్ములు
పురాణాల నుండి ప్రతిదీ గణితమే!
ఆర్యభట్టు
వరాహమిహురుడు
శ్రీనివాస రామానుజం
చేశారెన్నో అద్భుతాలు
లేచినది మొదలు
పడుకునే వరకు లెక్కల 'లెక్కే'!.
-మన్నె లలిత

అంకెల గారడీ

సూర్యోదయం నుంచే
ఇంట్లో లెక్కలు మొదలు
పాల వాళ్లూ
కూరల వాళ్లూ
పువ్వుల వాళ్లూ
పండ్ల వాళ్లూ
లెక్కలు పెట్టి ఇస్తారే
వంట వార్పు లో కూడా
అంతా లెక్కలే
బియ్యం కొలత
నీటి కొలత
కారం ఉప్పు
కొలత పోపు
దినుసులు, పప్పుల కొలత
బట్టల సైజ్ ల కొలత
పుస్తకాల పేజీల లెక్క
తేలికగా వక్కలతో
చింత గింజల ఆటలో
ఖర్జూరాలు
రేగిపళ్ళు
టమోట
బంగాళాదుంప
నిమ్మకాయలు
ఇలా లెక్కలు పెట్టిస్తూ
సులభం గా చెప్పిందే
ఎన్ని గాజులు కొన్నవో చెప్పు
ఎన్ని పకోడీలు తిన్నావో చెప్పు
ఇలా నిత్య జీవిత అంశాలు
అడుగుతూ తేలికగా నేర్పాలి
లెక్కలు రాని జీవితం వ్యర్థమే
అర్థంలేని చదువులు వ్యర్థమే
అన్ని భాషల్లో
అన్ని సబ్జెక్ట్స్ లో
లెక్కలు
బోటనీ జువాలజీ
ఫిజిక్స్ కెమిస్ట్రీ
కామర్స్
అనంతమైన లెక్కలు ,
ప్రతి దానికి ఒక లెక్క
పెళ్లి పేరంటం అన్నిటికీ లెక్కలే
పోక చెక్కలు
తమలపాకులు
అరటిపళ్ళు
కొబ్బరి కాయలు
పసుపు కొమ్ములు పువ్వులు
కాదేది అనర్హం లెక్కలకి
అందుకే చిన్నప్పుడే
తిక్క లేకుండా
లెక్కలు నేర్చుకుంటే
ఎదుగుదల సాధ్యం.
- నారుమంచి వాణీ ప్రభాకరి

డొక్క చించే!

బాబోయ్! లెక్కలు!
డొక్క చింపే లెక్కలు
రాగితాలు ఖరాబ్!
పంతులు గారి మొట్టికాయలు
వస్తే వందకి వంద!
లెక్కల్లో జీరోలొచ్చినా
మిగతావాటిలో హీరోలు
నోటిలెక్కల తాతా
కూరలమ్మి ముందు
కాలిక్యులేటర్ తో కుస్తీలు నేడు
ఆల్జీబ్రా గుండె గాభరా
జామెట్రీ ఎంచక్కా గీతలు
పైథాగరస్ సిద్ధాంతాలు
రోమన్ అరబిక్
హిందూ అంకెలు
అమ్మ ఉదరంలో పడగానే
మొదలు లెక్కించడం
మనిషి పోయినా
కర్మకాండలకు
తప్పదు లెక్కలు.
సున్నాతో ఆరంభం అనంతం
సర్వసమ్మతం
భాస్కర లీలావతి గణితాలు
ఖాగణితం
బీజ అంక క్షేత్ర గణితాలు
అద్వితీయం
శకుంతలా దేవి
అంధులైన సంజీవరాయశర్మ
గర్వకారణం.
సన్నగా పీలగా
శ్రీనివాసరామానుజం

అంకెలు- సంఖ్యలు

ఆ.వె. లెక్కలెన్నియున్న తక్కువేమిర బాబు
తప్పు దొరుకబట్టు తప్పెనేని
చక్క చేయుచుండు సరిగను లేకున్న
నోటి లెక్క లైన కోటి వరకు!.
ఆ.వె. సున్నకైన గాని సూత్రమ్ము ముఖ్యమే
బుర్ర గోక వలదు కుర్ర వాడ
చిటికెలోన చేసి చిత్రంగ చూపాలి
నోట్ల కట్ట లైన నోటి ద్వారా!.
ఆ.వె. గణితశాస్త్ర మిదియు ఘనముగా
నేర్వండి
పరిసరాలలోని పనుల జూసి
పాఠశాల యరుదు ప్రతివాడు నేర్చెను
చిన్న సంఖ్య నైన చిత్ర ముగను!.
- జక్కని గంగాధర్

జీవితమే లెక్కల మయం

మాతృగర్భం నుంచి ధరణిపై
జన్మించడానికి తొమ్మిది నెలలు
ఐదేండ్ల ప్రాయంలో అక్షరాభ్యాసం
చదువుకుని ఉద్యోగం చేసి
మూడుముళ్ళ బంధంతో
వధువు మెడలో మంగళ సూత్ర ధారణ
సప్తపదులతో సన్నిహితులు తొక్కి నడవడం
పుట్టినపుడు
బతకడానికి
చివరికి పోయేటప్పుడు
లెక్కలు లేనిదే జీవితం లేదు
బాల్యం నుంచి గణితంలో ప్రతిభను చూపి
కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్
హార్డీ ప్రశంసలు పొంది
ఎందరికో తన సిద్ధాంతాల ద్వారా
పరిశోధనలకు రూపకల్పన చేసిన
శ్రీనివాస రామానుజన్
భరతమాత ముద్దుబిడ్డ
ముప్పది మూడేండ్లు జీవించినా
గణిత పరిశోధన ఎందరికో ప్రామాణికం
నేడు లెక్కలు వేసుకుని
ఏ వయస్సులో చేయవలసిన పని
శ్రీకృష్ణపరమాత్మ గీతలో చెప్పినట్లు
"కర్మణ్యేవాధికారాస్తే
మాఫలేషు కథాచన"అని
ప్రవర్తిస్తే జీవితసాఫల్యం
నవగ్రహాలు, త్రిమూర్తులు
అష్టాదశ పురాణాలు,
చతుర్వేదాలు, అష్టలక్ష్ములు
సప్త సాగరాలు, ముల్లోకాలు
అన్ని సంఖ్యా శాస్త్ర ఆధారితమే
అందుకే
జీవితమే లెక్కల మయం
అక్షర సత్యం...!!.
-ఆచార్య అయ్యల సోమయాజుల ప్రసాద్

భయం

చదివేవారికి భయం
వినేవారికి అత్యంత భయం
రాసేవారికి అయోమయం
లెక్కపెట్టేవారికి తప్పిదం.
ఇంటిలోనే ముడిపడు
కార్యాలయంలో కనపడు
యజమానికి చెప్పబడు
ఇల్లాలికి వివరించబడు.
పిల్లలు తడబడు
పెద్దలు చతికిలబడు
క్లర్కులు కలవరపడు
లెక్కలు పుటలో పడు.
ఎక్కువ తక్కువలు తికమక
గుణిజభాగహార సరిగాక
కనిష్ట గరిష్ట గడబిడలు
బీజగణిత రూట్ల తడబడులు.
ఆర్థిక అసమానతలు
రాజకీయ అవినీతులు
సామాజిక ఉచితాలు
పరిపాలనలో పలువిధాలు.
జీవితమే లెక్కలమయం
జీవనం ప్రణాళికబద్ధం
జీవికి కావలిసింది సుఖం
ఎత్తులతో చేసేది గణితం.
ఆర్యభట్టతో ఆరంభం
రామానుజంతో సిద్ధాంతం
గణితాన్ని జ్ఞప్తి తెచ్చినవైనం
మానవాళికి ఇది సుదినం.
ప్రణాళికతో ప్రారంభించు
పదిలంగా పొదుపుచేయు
భవిష్యత్తుకు బాటలువేయు
బిడియం భయం విడిపించు.
-గుండవరం కొండల్ రావు

స్వాగతిద్దాం!!

మనిషికెప్పుడు కొత్తదనంకావాలి
గతంతాలూకు నీలినీడలు వదిలేద్దాం
వర్తమానంగురించి అక్కరలేదు
భవిష్యత్తుమీదే ఆశంతా
వేయివెలుగుల కాంతులతో
ప్రాచీదిశన ప్రొద్దు పొడుస్తున్నది
కొత్తఆలోచనలతో మనసువెదగాలి
రోజూరాజేసే అగ్నిశకలంకూడా
కణకణమండాలంటే
కొత్తగాలి వీచాల్సిందే
ఆనందాలు కావాలనుకుంటే
కష్టం అనుభవంలోకి రావాలి
నూతనఆవిష్కరణలతో యువత
ఆకాశమే హద్దుగా ఎదగాలి
ద్వేషాలు మరచి ప్రేమలునిండిన
మనసున్న మంచిమనుషులుకావాలి

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2023 ఫలితాలు

గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం గత ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న "జన రంజక కవి ప్రతిభా పురస్కార ఫలితాలు" ప్రకటించారు. 2019 నుండి 2023 వరకు ప్రచురించిన 115 గ్రంథాలు పోటీకి రాగా ఆరు పుస్తకాలను పురస్కారాలకు ఎంపిక చేయటం జరిగింది.

1. వద్య ప్రభాతం(పద్యాలు) పాలపర్తి హవీలా (ఖమ్మం)
2. కావ్య విపంచి(పద్యాలు)-డా. దేవరవల్లి ప్రభుదాస్ (గుంటూరు)
3. నీటి గింజల పంట (వచన కవితలు) - కంచరాన భుజంగరావు (శ్రీకాకుళం)
4.కలల రంగు (వచన కవితలు) - రహీముద్దిన్ (మహబూబాబాద్)
5.మెల గొలుకు చేను(వచన కవితలు)-శివకుమార్ పేరిశెట్ల (నెల్లూరు)
6.రాగుల సీమ (దీర్ఘ కవిత) -యాములపల్లి నరసిరెడ్డి (శ్రీసత్య సాయి జిల్లా)

2024 ఫిబ్రవరి 14 బుధవారం సాయంత్రం ఆరు గం.కు గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదిక మీద జరిగే పురస్కారాల సభలో ప్రముఖ సాహితీవేత్తల సమక్షంలో ఒక్కొక్క కవిని శాలువాతో జ్ఞాపికతో రెండు వేల రూపాయల నగదుతో సత్కరించటం జరుగుతుంది. సర్రాప్రభావతి, కన్వీనర్, రావి రంగారావు సాహిత్య పీఠం (రి.నం. 6/2006), గుంటూరు.

కొత్త శీర్షిక ఈ వారం కొత్త కథ

త్వరలో 'నేటి నిజం' దిన పత్రికలో
'ఈ వారం కొత్త కథ' శీర్షికను
ప్రారంభిస్తున్నాము.

ఈ శీర్షికకు రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.

కథలు చేతిరాతలో నాలుగు పావుతావు పేజీలు మించకూడదు.

డిటిపిలో అయితే
రెండు పేజీలకు మించకూడదు.

ప్రియాంక ఫాంటులో డిటిపి చేయాలి.
ఓపెన్ ఫైలుతో పాటు
పిడిఎఫ్ ఫైలు కూడా పంపాలి.

ప్రచురించే ప్రతి కథకు విశాల సాహితి
300 రూపాయలు పారితోషికాన్ని
బహుమతిగా అందజేస్తుంది.

ఈ శీర్షికను నిర్వహించేందుకు
సుప్రసిద్ధ రచయిత
బి. ఎస్.రాములు గారు అంగీకరించారు.
-వైస దేవదాసు:సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి. 169, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020
email: netinizam2020@gmail.com

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
(ప్రథమ)

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

శమంతక మణి

మహిళాభ్యుదయానికి
బాలబాలికల పరిణతికి
అత్యున్నత బాట వేసిన
తొలి మహిళా గురువు....
సమాజపు మూర్ఖపు కట్టుబాట్లను
సంప్రదాయాలను ఖండించి
బడుగు వర్గాల స్త్రీలకు
విద్యదానం చేసిన
మహోన్నత నారి....
మహిళా హక్కుల కోసం
పోరాటం సలిపి విజయం
సాధించిన వీర నారి....
ఎన్నో అవమానాలను ఎదుర్కొని
మహిళల కొరకు ప్రత్యేక సంస్థను
స్థాపించి స్త్రీలలో అద్భుతమైన
చైతన్యాన్ని కలిగించిన
మానవతా మూర్తి...
బాల్య వివాహాలకు
సమాధి కట్టిన మహాశక్తి వితంతువులకు
పునర్వివాహాలు జరిపించి
కొత్త జీవితాలను
ప్రసాదించిన వరదాయిని...
ఎందరో అనాథలకు తల్లి లేని లోటును
భర్తీ చేసిన అనాథ రక్షకి...
తానే స్వయంగా ఓ అనాథకు తల్లియై
మాతృత్వానికే కొత్త నిర్వచనం ఇచ్చిన
మాతృమూర్తి....
సావిత్రి బాయి పూలే
అభ్యుదయ నారీ రత్నం ...
స్వంత పతి శిష్యరికంలో
మెరుగు పెట్టబడిన వజ్రం ....
సావిత్రి బాయి పూలె అక్షరాలలో
నిర్వచించలేని నారీమణి...
సావిత్రీ బాయి పూలే స్త్రీ జాతికో
శమంతక మణి...!!
-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు
నాగార్జున సాగర్

వెలుగు బాట

తొలి మహిళా గురువు
ఆటుపోట్ల దరువులతో
ఎదురునిల్చి పోరాడినా
సువర్ణ అక్షరాల లికితం
జ్ఞాన కాంతుల చాపం
జ్వలిత ప్రజ్వలితం ఎందరినో తీర్చి
దిద్దివేసెను బంగరు భవితకు సోపానం.
జీవనుషోదయ కిరణ శోభితనీ
మెరుగు పెట్టిన పసిడిలా పిల్లల జీవితం
తులతూచునది దివ్య కాంతుల ప్రదీపం
మహిమాణితం మంజుల గానం.
తానో తొలి పలుకుల జ్ఞానబడి
అమ్మ ఒడిగా మారి బడిబాటలో
పయనింప జేసీ గురువై
వేలు పట్టి నడిపించి
తను దార పోసిన విద్యాపటిమతో.
లోకనీ చూపిన
మార్గదర్శిని నేటి శిష్యుడే
రేపటి తనవారసుడుగా
నిల్పిన జ్ఞానదాత
గురువు లేక సర్వం శూన్యం అపుడీ.
ఈ సరస్వతీ సంతానం
సకల భోగాలతో
విజ్ఞాన భూషితమై
సర్వాలంకార భరణమై
విశ్వంభరుడు తానే తానై
వినుతి కెక్కు
-విజయకుమారి
9100634635

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.